నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
1
గురువారం | 15 ఫిబ్రవరి 2024 | www.navatelangana.com

## నూతన ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన బాలాజీ

- సిద్దిపేట కమిషనర్ అనూరాధను కలిసిన ఏసీపీ బాలాజీ



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

గజ్వేల్ డివిజన్ నూతన ఏసిపిగా ఏ. బాలాజీ పదవీ బాధ్యతలు చేపట్టారు. బుధవారం సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధను మర్యాదపూర్వకంగా కలసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ ఏసీపీ బాలాజీని అభినందించారు. గజ్వేల్ డివిజన్ పరిధిలో గంజాయి, మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. అసాంఘిక కార్యక్రమాల జరగకుండా తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పిడిఎస్ రైస్, ఇసుక అక్రమ రవాణా జరగకుండా పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. మత్తు పదార్థాల రహిత జిల్లాగా ఏర్పాటు చేయడానికి కృషి చేయాలన్నారు. రాబోవు ఎంపీ ఎలక్షన్ సందర్భంగాముందస్తు ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. దొంగతనాలు జరగకుండా దృష్టి సారించాలని తెలిపారు. గజ్వేల్ పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ గురించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

## టాస్క్ ఫోర్స్ అధికారుల దాడి

పోలీసుల అదుపులో నలుగురు
రూ. 7,600 నగదు, మొబైల్ ఫోన్లు, ద్విచక్ర వాహనాల స్వాధీనం



నవతెలంగాణ-బెజ్జంకి

నమ్మదగిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ అధికారులు పత్తాలాట స్థావరంపై బుధవారం దాడి చేశారు. మండల పరిధిలోని ముత్తన్నపేట గ్రామ శివారులో జూదం ఆడుతున్న నలుగురిని టాస్క్ ఫోర్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.7,600 నగదు, 4 మొబైల్ ఫోన్లు, నాలుగ ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అక్రమ ఇసుక, రేషన్ బియ్యం తరలింపు, మత్తు పదార్థాలను కలిగియున్న, విక్రయించిన చట్టపరమైన చర్యలు తప్పవని టాస్క్ ఫోర్స్ అధికారులు హెచ్చరించారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే 8712667446, 8712667447 నంబర్లకు సమాచారం అందించాలని అధికారులు సూచించారు.

# కార్మికుల పట్ల యజమాన్యాలు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- సిఎంహెచ్ రసాయన పరిశ్రమ ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి
- ప్రమాదంపై స్పందించని సంబంధిత అధికారులపై చర్యలు
- కార్మికులకు న్యాయం చేస్తాం
- ధ్రువ ఆసుపత్రిలో ప్రమాద క్షతగాత్రులను పరామర్శించిన
- మంత్రి దామోదర రాజనర్సింహ, జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి





నవతెలంగాణ-పటాన్ చెరు

పాశ మైలారం పారిశ్రామిక వాడలో సిఎంహెచ్ రసాయన పరిశ్రమలో మంగళవారం రాత్రి జరిగిన ప్రమాద ఘటనలో ఒకరు మృతి చెందగా, పట్టణంలోని ధ్రువ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతిలు బుధవారం సాయంత్రం పరామర్శించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ పాశమైలారం పారిశ్రామిక వాడలోని సిఎంహెచ్ రసాయన పరిశ్రమలో రియాక్టర్ పేలిన ఘటనలో ఒకరు మృతి చెందడం, మరో నలుగురు తీవ్ర గాయాలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతుండడం తమను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. బాధితులకు పూర్తి స్థాయిలో ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్మికుల పట్ల నిర్లక్ష్యం చేస్తే ఎంతటి ఉపేక్షించ బోమని హెచ్చరించారు. ప్రతి పారిశ్రామిక వాడలో అంబులెన్స్ తప్పనిసరిగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అంబులెన్సు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ప్రమాద ఘటనపై సంబంధిత అధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తమ దృష్టికి వచ్చినట్లు ఈ ఘటనపై స్పందించని సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు.బతుకు తెరువు కోసం వచ్చిన కార్మికులకు న్యాయం చేస్తామన్నారు. పారిశ్రామికవాడలో ప్రమాదం జరగడం దురదృష్టకరమని ఇలాంటి దుర్ఘటనలు జరుగుతున్నప్పుడు యజమాన్యాలలో మార్పు రావలసిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్తును హరించే ఇథనాల్ పరిశ్రమ మాకొద్దు

- ఇథనాల్ నిర్మాణ పనులపై భగ్గుమన్న గుగ్గీల్ల, తిమ్మాయిపల్లి గ్రామస్తులు
- పరిశ్రమ ప్రతినిధులను గ్రామ పంచాయతీలో నిర్బందించిన గ్రామస్తులు
- ఏసీపీ సురేందర్ రెడ్డి హామీతో శాంతించిన గ్రామస్తులు





నవతెలంగాణ-బెజ్జంకి

గ్రామీణ ప్రజల భవిష్యత్తును హరించే ఇథనాల్ పరిశ్రమ మాకొద్దంటూ మండల పరిధిలోని గుగ్గీల్ల, తిమ్మాయిపల్లి గ్రామస్తులు పరిశ్రమ ప్రతినిధులు, పోలీసుశాఖ అధికారుల ఎదుట పురుగుల మందుల డబ్బాలతో నిరసన వ్యక్తం చేశారు. బుధవారం గుగ్గీల్ల గ్రామ శివారులో ఇథనాల్ పరిశ్రమ నిర్మాణ పనులు చేపడుతున్నారనే సమాచారంతో భగ్గుమన్న గుగ్గీల్ల, తిమ్మాయిపల్లి గ్రామస్తులు పరిశ్రమ ప్రతినిధులను గుగ్గీల్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్భందించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు పరిశ్రమ ప్రతినిధులకు భద్రత ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ ప్రజలకు ఇథనాల్ పరిశ్రమపై నెలకొన్న వాగ్వాదాంపై సీఐ శ్రీనివాస్ గ్రామస్తులను శాంతింపజేసేందుకు యత్నించగా ఇథనాల్ పరిశ్రమ నిర్మాణం తాము వద్దంటున్నాం.. ప్రజాభిప్రాయానికి ప్రభుత్వం కట్టుబడి ఉండాలని.. అధికారులు ప్రజలకు సహకరించాలని గ్రామ మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం తెలుసుకున్న ఏసీపీ సురేందర్ రెడ్డి పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ ప్రజలతో మాట్లాడారు. ఇథనాల్ పరిశ్రమ యాజమాన్యం నిర్మాణ పనులు ప్రారంభిస్తోందని.. పరిశ్రమ నిర్మాణం వల్ల భవిష్యత్తులో జీవనానికి మనుగడ లేకుండా పోతోందని పోలీసుశాఖ అధికారులు సహకరించాలని ఏసీపీకి గ్రామస్తులు ప్రాదేయపడ్డారు. పరిశ్రమ నిర్మాణ పనులను ప్రారంభించిన ప్రాంతాన్ని ఏసీపీ, సీఐ, ఎస్ఐతో కలిసి సందర్శించి పరిశీలించారు. ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా పోలీసుశాఖ వ్యవహరించదని.. పరిశ్రమ నిర్మాణ పనులపై విధ్వంసానికి పాల్పడితే చట్టపరమైన చర్యలకు వెనుకాడబోమని ఏసీపీ సురేందర్ రెడ్డి గ్రామస్తులను హెచ్చరించారు.

### ప్రయాణం ప్రమాదకరంగా మారింది

గుగ్గీల్ల గ్రామానికి వేళ్లే ప్రధాన రోడ్డు ప్రక్కన నిర్మించిన ఆర్ఆర్ సీ పారాబాయిల్డ్ రైస్ మిల్, మైత్రి సాల్వెంట్ పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలతో దుర్వాసన, దూళితో రాత్రి సమయంలో వాహనదారులకు ప్రయాణం ప్రమాదకరంగా మారిందని తక్షణమే రక్షణ చర్యలు చేపట్టాలని గుగ్గీల్ల గ్రామస్తులు పారాబాయిల్డ్ రైస్ మిల్‌ను ముట్టడించారు. సీఐ శ్రీనివాస్ యాజమాన్యంతో సంప్రదించి సమస్యను పరిష్కరించేలా కృషి చేస్తామని సూచించడంతో గ్రామస్తులు తమ ఆందోళనను విరమించారు.

## సమస్యగా మారిన అక్కన్నపేట కల్తీకల్లు

బానిసలుగా మారుతున్న కల్లు బాబులు
పొద్దుకు మూడు పూటలు ఈ కల్లు తాగాల్సిందే
చుట్టుముడుతున్న అనారోగ్య సమస్యలు
అక్కన్నపేట కళ్ళు తాగి మతిపోయి బావిలో పడ్డ వ్యక్తి
బావిలో పడ్డ వ్యక్తిని కాపాడిన ఫైర్ సిబ్బంది
మరోసారి తెరమీదికి అక్కన్నపేట కల్తీకల్లు





నవతెలంగాణ-రామాయంపేట

కల్తీకల్లు ఎంతోమంది జీవితాలను చిన్నాభిన్నం చేస్తుంది. కల్తీ కళ్ళు తాగుతున్న కల్లు ప్రియులు తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కోవడమే కాకుండా, ఏ పనిని చేసుకోలేని మానసిక రోగులుగా మారుతున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా మండల పరిధిలోని అక్కన్నపేట రైల్వే స్టేషన్ దగ్గరలో ఉన్న కల్లు దుకాణం తీవ్ర సమస్యగా మారింది. ఈ కల్లు దుకాణంలో విక్రయిస్తున్న కల్తీ కల్లుకు వందలాది మంది బానిసలుగా మారుతున్నారు. ఈ కల్లులో అల్ఫ్రోజొంతో పాటు ఇతర ప్రమాదకర డ్రగ్స్ వినియోగిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. దీంతో మానసిక సమస్యలతో పాటు, ఆకలి లేమి, తీవ్ర అలసట తోపాటు ఇతర అనారోగ్య సమస్యలు కల్లుబాబులను చుట్టు ముడుతున్నాయి.

### పొద్దుకు మూడు పూటలు తాగాల్సిందే

ఒకసారి అక్కన్నపేట స్టేషన్ దగ్గరలో ఉన్న కల్లు దుకాణంలో కల్లుకు అలవాటు పడితే పొద్దుకి మూడు పూటలు తాగాల్సిందే. ఎక్కడ.. ఏ పని మీద ఉన్న వదిలేసి ఉన్నఫలంగా కల్లు దుకాణం బాట పట్టాల్సిందే. ఎందుకంటే ఈ కల్లులో అనుమతులు లేని అల్ఫ్రోజొంతో పాటు ఇతర ప్రమాదకర డ్రగ్స్ వినియోగం వల్ల దానికి బానిసలుగా మారుతారు. ఉదయం 8 గంటలకే అక్కన్నపేట కల్లు దుకాణం వద్ద కల్లుబాబులు బారులు తీరుతున్నారు. మండల కేంద్రమైన రామాయంపేట నుండే కాకుండా, చుట్టుపక్కల గ్రామాల నుంచి నిత్యం వందలాది మంది అక్కన్నపేట రైల్వే స్టేషన్ దగ్గరలో ఉన్న కల్లు దుకాణానికి చేరుకుంటారు. కొంతమంది మరో రెండు పూటలకు సరిపడా వెంట తీసుకెళ్లగా, మరి కొంతమంది పొద్దుకి మూడు పూటలు అక్కన్నపేటకు వచ్చి కల్లు తాగి వెళ్తారు. కల్లుకు బానిసలుగా మారిన వీరికి అనారోగ్య సమస్యలు వెంటాడమే కాకుండా, మందబుద్ధి మానసిక ఇబ్బందులతో ఏ పని చేసుకోలేకపోతున్నారు. అక్కన్నపేట స్టేషన్ పరిధిలోని కల్లు దుకాణంలో పెద్ద ఎత్తున కల్తీకల్లు విక్రయిస్తున్న సంబంధిత అధికారులు పట్టించుకోకవడం పట్ల అనుమానాలు వ్యక్త అవుతున్నాయి.

### అక్కన్నపేట కల్లు తాగి మతిపోయి బావిలో పడ్డ వ్యక్తి

అక్కన్నపేట స్టేషన్ సమీపంలో ఉన్న కల్లు దుకాణంలో హైదరాబాద్ ఘట్‌కేసర్ చెందిన నిరంజన్ అనే వ్యక్తి అక్కన్నపేట రైల్వే స్టేషన్ దగ్గరలో ఉన్న కల్లు దుకాణంలో కల్లు తాగాడు. ఆ తర్వాత మతిస్థిమితం తప్పి కల్లు దుకాణానికి సమీపంలో ఉన్న పాడుబడ్డ బావిలో పడిపోయాడు. స్థానికులు గమనించి ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా, ఫైర్ సిబ్బంది బావిలో పడిపోయిన నిరంజన్‌ను తాళ్ల సహాయంతో లోపలికి దిగి, బాధితున్ని పైకి లాగారు. బాధితుడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. కల్లు తాగిన తర్వాత ఎటు వెళ్తున్నానో తనకు తెలియక బావిలో పడిపోయానని క్షతగాత్రుడు నిరంజన్ తెలిపారు.

## ట్రావెల్ బస్సును ఢీకొట్టిని లారీ

- ఒకరు మృతి, పలువురికి గాయాలు





నవతెలంగాణ- నిజాంపేట

పాలమాకుల గ్రామానికి చెందిన విజయ్ వివాహం మెదక్ కన్వెన్షన్ హాల్లో ఉండగా సిద్దిపేట నుంచి సంగీత ట్రావెల్స్ బస్సులో పెళ్లి కొడుకు బంధువులు బయలుదేరారు. నిజాంపేట గ్రామ శివారులోని రాగానే ఎదురుగా చేగుంట నుంచి సిద్దిపేటకు వెళ్తున్న లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా నడిపి బస్సును ఢీకొట్టాడు. బస్సులో ప్రయాణిస్తున్న సుమారు 15 మందికి గాయాలు కాగా 108 అంబులెన్స్‌లో వారిని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చేర్యాల లింగయ్య (74) చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతని భార్య విజయలక్ష్మి కూతురు లలితలను మెరుగైన చికిత్స కొరకు హైదరాబాద్‌కు తరలించారు. బస్సును నడుపుతున్న శ్రీనివాస్, లారీ డ్రైవర్ పొన్నం ప్రభాకర్‌లకు కూడా గాయాలయ్యాయి. మృతుడు లింగయ్య కొడుకు అయిన రామరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని నిజాంపేట పోలీసులు తెలిపారు .

### బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే

విషయం తెలుసుకున్న మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు క్షతగాత్రులను ఫోన్లో పరామర్శించారు. వెంటనే సిద్దిపేటలో ఉన్న ఏరియా ఆసుపత్రి సూపరింటెంట్‌తో ఫోన్‌లో మాట్లాడి క్షతగాత్రులకు వైద్య సదుపాయం అందజేయాలని సూచించారు. అవసరమైతే హైద్రాబాద్‌లోని ఆసుపత్రికి తరలించాలని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వారిని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ ఫోన్‌లో మాట్లాడి భరోసా కల్పించారు.

## పుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రిన్సిపాల్



నవతెలంగాణ -గజ్వేల్

గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ బాలచంద్రం రాసిన ఫైనాన్షియల్ అకౌంటింగ్ పుస్తకాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.వి.ఉమాశశి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎంతో కష్టతరమైన సబ్జెక్టును ఎంచుకొని బీకాం విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని చాలా సులభతరంగా వ్రాయటం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమైనదని వివరించారు. పుస్తక రచయిత డాక్టర్ బాలచంద్రం మాట్లాడుతూ ఈ పుస్తకం రాయటంలో ఎంతో కష్టతరమైనప్పటికీ విద్యార్థుల అభ్యున్నతిని దృష్టిలో పెట్టుకొని రాయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ పి. జయరాజు ,అధ్యాపకులు, కస్తూరిబాయ్, వీరయ్య, శ్రీలత, సరోజన, నరేష్ మొదలగు ఆధ్యాపకులు పుస్తక రచనకు హర్షం వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలిపారు. తదనంతరం కళాశాల ప్రిన్సిపాల్ అధ్యాపకులు శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు.

## రాయపోల్ నూతన ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న పి. బాలయ్య



నవతెలంగాణ-రాయపోల్: రాయపోల్ మండలం ఎంపీడీవోగా విధులు నిర్వహించిన జి.మున్నయ్య బదిలీపై నల్గొండ జిల్లా వెళ్లారు. వికారాబాద్ జిల్లా బంటారం మండల ఎంపీడీవోగా విధులు నిర్వహించిన పి. బాలయ్య రాయపోల్ ఎంపీడీవోగా బదిలీపై వచ్చారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో బాలయ్య బాధ్యతలు స్వీకరించారు. వారికి ఎంపిపి కల్లూరి అనిత శ్రీనివాస్, ఎంపీఓ లక్ష్మీనారాయణ శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ బాలయ్య మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు మండలాన్ని అన్ని రకాల అభివృద్ధి చేసుకునేందుకు సహకరించాలని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ అన్ని సమస్యలు పరిష్కరించేందుకు ఎల్లప్పుడు ప్రయత్నిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కల్లూరి అనిత శ్రీనివాస్, మండల పంచాయతీ అధికారి లక్ష్మీనారాయణ, ఏపీవో రాములు, సీనియర్ అసిస్టెంట్ ముతాలీఫ్, ఈసి రవి,టిఏ లు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## సమ్మెలో రవాణా రంగ కార్మికులు భారీగా పాల్గొనాలి

- హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలి
- కార్మిక వ్యతిరేక మోడీకి గుణపాఠం చెప్పాలి : సిఐటియు జిల్లా కార్యదర్శి జి. సాయిలు



నవతెలంగాణ-సంగారెడ్డి

ఈనెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో రవాణా రంగ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని సిఐటియు జిల్లా కార్యదర్శి జి. సాయిలు కార్మికులకు పిలుపునిచ్చారు. బుధవారం సుందరయ్య భవన్లో రవాణా రంగ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జి. సాయిలు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక కర్షక ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 16న దేశవ్యాప్త సమ్మె గ్రామీణ బంద్ జరుగుతుందని అందులో రవాణా రంగ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చిన పది సంవత్సరాల కాలంలో ఎం.వి యాక్ట్ ను మారుస్తూ రవాణా రంగ కార్మికుల నడ్డి విరిచిందని, పెట్రోల్ డీజిల్ ధరలు విపరీతంగా పెంచిందని విమర్శించారు. రవాణా రంగ కార్మికుల సంక్షేమం కోసం ఏ రోజు కేంద్ర ప్రభుత్వం ఆలోచించడం లేదని అన్నారు. సంవత్సరానికి 2 కోట్లు ఉద్యోగాలు ఇస్తామని 10 సంవత్సరాలైనా ఉద్యోగం దిక్కు లేక నిరుద్యోగులు ఆటో డ్రైవింగ్ ఫీల్డ్ ని ఎంచుకొని ఉపాధి పొందుతుంటే చట్టాలను మారుస్తూ రవాణా రంగం కార్మికులను దెబ్బ కొడుతుందని అన్నారు. రవాణా రంగం కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక మోడీకి గుణపాఠం చెప్పాలని ఈ సమావేశంలో ఫారుక్, వెంకటేష్, మొయినుద్దీన్, శ్రీనివాస్, నాగేశ్వరరావు, మహేందర్, రాజు, నగేష్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికులకు జహీరాబాద్ లో పర్మినెంట్ అడ్డా కేటాయించాలి

- సిఐటియూ జిల్లా సహాయ కార్యదర్శి మహిపాల



నవతెలంగాణ -జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలో భవన నిర్మాణ కార్మికుల కు అడ్డా లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని, వీరికి తక్షణమే అడ్డా కేటాయించాలని సిఐటియూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. మహిపాల్ డిమాండ్ చేశారు. 1996 చట్టం ప్రకారం అడ్డాతోపాటు మంచినీరు, టాయిలెట్స్ లాంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. బుధవారం జహీరాబాద్‌లోని అడ్డా వద్ద జరిగిన భవన నిర్మాణ కార్మికుల సమ్మె సదస్సులో మహిపాల్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల చట్టాన్ని కూడా మార్చేసి కార్మికులను నట్టేట ముంచడానికి ప్రయత్నిస్తుందన్నారు. 16న సమ్మెలో అత్యధిక మంది కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ పట్టణ భవన నిర్మాణ కార్మికుల యూనియన్ ప్రధాన కార్యదర్శి బక్కన్న నాయకులు యోహాను తుల్జారాం పాల్గొన్నారు.

## మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం

- 16న దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేద్దాం
- కేవీపీఎస్ రౌండ్ టేబుల్ సమావేశంలో సామాజిక ప్రజా సంఘాల నాయకుల పిలుపు



**నవతెలంగాణ-సంగారెడ్డి:** ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త కార్మిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్ ను జయప్రదం చేయాలని కోరుతూ సంగారెడ్డి సుందరయ్య భవన్లో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు పి. అశోక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్, సీనియర్ దళిత నాయకులు అనంతయ్య, నాగయ్య లక్ష్మయ్య అంబెద్కర్ సంఘం జిల్లా అధ్యక్షులు దుర్గాప్రసాద్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి యాదవరెడ్డి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సిములు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గత పది సంవత్సరాలుగా కార్మికులు రైతులు వ్యవసాయ కూలీల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వ రంగాన్ని ప్రయివేట్ పరం చేస్తున్నారని కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం 26,000 ఇవ్వాలని ఉద్యోగ భద్రత కల్పించాలని అన్ని పరిశ్రమల్లో ఈఎస్ఐ,పిఎఫ్ లాంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు . రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు రావడంలేదని మధ్య దళారులు అందిన కాడికి దోచుకుంటున్నారని అని అన్నారు.కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి సమత సైనిక్ దళ్ నాయకులు బస్వరాజ్, స్వేరో నాయకులు ప్రవీణ్,కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు రాజు, నాయకులు దత్తు, బూమయ్య, నాగరాజు, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులపై బీజేపీ ప్రభుత్వ దమనకాండను ఖండించండి

- పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలి.
- ఫిబ్రవరి 16 సమ్మె గ్రామీణ బంద్ జయప్రదం చేయండి :
- రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గొల్లపల్లి జయరాజు



నవతెలంగాణ- సదాశివపేట

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశ రాజధాని ఢిల్లీ నగరంలో రైతులపై సాగిస్తున్న దమన కాండను తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గొల్లపల్లి జయరాజు ఖండించారు. ఈ సందర్భంగా సదాశివపేట మండలం తంగడపల్లి గ్రామంలో తంగడపల్లి మద్దికొండ ఆత్మకూరు గ్రామాలలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ రైతు సంఘాలకు పార్లమెంటు సాక్షిగా కేంద్ర ప్రభుత్వం రాతపూర్వకంగా రాసి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఢిల్లీలో ఆందోళన చేస్తున్న రైతులపై పోలీస్ యంత్రాంగాన్ని మోహరించి లాఠీచార్జి, నీటి ఫిరంగులు, రబ్బర్ బుల్లెట్లు, బాష వాయువు డ్రోన్లతో ఉపయోగించడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతు సంఘాలకు స్వామినాథన్ కమిటీ సిఫారసులు అమలు చేస్తామని రాతపూర్వకమైన హామీ ఇచ్చి వాటిని తుంగలో తొక్కి ఆయన చనిపోయిన తర్వాత భారతరత్న ఇవ్వడం బిజెపి ప్రభుత్వానికి సిగ్గుచేటని ఆయన విమర్శించారు . మద్దతు ధరల చట్టం లేకపోవడంతో ఏటా దేశవ్యాప్తంగా రైతులు నాలుగు లక్షల కోట్ల రూపాయలు నష్టపోతున్నారని అన్నారు. దేశవ్యాప్తంగా రైతాంగానికి ఉన్న అప్పులను మాఫీ చేయాలని 60 ఏళ్ల దాటిన రైతాంగానికి నెలకు 5000 రూపాయల పెన్షన్ ఇవ్వాలని అన్ని రకాల పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని తదితర డిమాండ్లతో రైతులు పోరాటం చేస్తున్నారని అన్నారు. నిరసన కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శ బి.యాదవరెడ్డి, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ప్రవీణ్, నాయకులు ఆంజనేయులు మల్లేశం, ఏసోబు, మహేష్, సంజీవ, రైతులు పాల్గొన్నారు.

## బీసీలకు కేంద్రం అన్యాయం

- బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు
- కార్య శ్రీశైలం యాదవ్.



నవ తెలంగాణ- హత్నూర.

బీసీలకు కేంద్ర బడ్జెట్లో అన్యాయం జరిగిందని బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు శ్రీశైలం యాదవ్ అన్నారు. బుధవారం దౌల్తాబాద్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశంలో ఉన్న 75 కోట్ల మంది ఉన్న బీసీలకు కేంద్ర ప్రభుత్వం కేటాయించిన 2150 కోట్లు కనీసం బిస్కెట్లు కూడా రావన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీసీలకు 50 శాతం టికెట్లు కేటాయించాలన్నారు. త్వరలో చేపట్టబోయే జనగణన కులాల వారీగా లెక్కలు తీయాలన్నారు. బిసి ప్రత్యేక మంత్రిత్వ శాఖ కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఆర్టిజన్ నరేష్‌ను హత్య చేసిన దుండగులను శిక్షించాలి

- టీఎస్ యుఈఈయు సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షులు ఏ. మహేందర్ రెడ్డి
- ట్రాన్స్కోఎస్ఈ కార్యాలయంలో వినతి



నవతెలంగాణ-మెదక్

మెదక్ జిల్లా కొల్చారం సెక్షన్‌లోని హంసన్ పల్లి సబ్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఆర్టిజన్ నరేష్ ను హత్య చేసిన దుండగులను గుర్తించి శిక్షించాలని టీఎస్ యుఈఈయు సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షులు ఏ. మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మెదక్ పట్టణంలోని విద్యుత్ ఎస్ఈ కార్యాలయంలో ఎస్ఏఓకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ స్టేషన్‌లో రాత్రి విధులు నిర్వహిస్తున్న ఆర్టిజన్ నరేష్ హత్యకు గురికావడం చాలా బాధాకరమన్నారు. హత్యకు పాల్పడిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించేలా పోలీస్ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. మృతుడి కుటుంబానికి విద్యుత్ సంస్థ నుంచి రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషయా అందించాలన్నారు. మెదక్ జిల్లాలోని అన్ని సబ్ స్టేషన్లలో 4వ ఆర్టిజన్‌లతో పాటు వాచ్‌మెన్‌లను నియమించాలని, అన్ని సబ్ స్టేషన్లలో కెమెరాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఆర్టిజన్స్ మరణిస్తే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియాను విద్యుత్ సంస్థ ద్వారా అందించేవారని, 2020 లో ఈ ఎక్స్‌గ్రేషియాను విద్యుత్ సంస్థ తొలిగించిందని, వెంటనే ఈ ఎక్స్‌గ్రేషియా రూ.20 లక్షలకు పెంచి ఆర్టిజన్స్ అందరికి అమలు చేయాలని డిమాండ్ చేశారు. శిథిలావస్థకు చేరిన అన్ని సబ్ స్టేషన్లను నూతన భవనాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కడారి నాగరాజు, నాయకులు స్వామి, నర్సింహులు, యాదగిరి, ఫసి, భాను, సురేష్, రాములు, మల్లేష్, గౌరి శంకర్, పృథ్వి రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## స్మశాన వాటికలో పసికందు లభ్యం




- ప్రాణాలతో కాపాడిన గ్రామస్తులు
- చికిత్స కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు

**నవతెలంగాణ-పుల్కల్**

పసికందును దుప్పట్లో ఉంచి రాళ్ల కుప్పలో పెట్టిన సంఘటన పుల్కల్ మండల పరిధిలోని ముదిమాణిక్యం గ్రామంలో బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. దానిపై ఒక రౌతు కూడా పెట్టి ఉంది. ఆ పసిబిడ్డను గ్రామస్తులు కాపాడారు. గ్రామస్తుల కథనం ప్రకారం .. ఆ మహిళపై కొంతమంది మహిళలు దాడి చేసేందుకు ప్రయత్నించగా, విషయం తెలుసుకుని హుటాహుటిన పుల్కల్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. పసికందు మగ బిడ్డ కావడంతో సంతానం లేని వారు తమకంటే తమకు ఇవ్వాలని పోలీసులను ప్రాధేయపడ్డారు. పుల్కల్ ఎస్సై క్రాంతి కిరణ్ తల్లీబిడ్డలను చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పసిబిడ్డకు పూర్తి వైద్యం అందాక గ్రామ పెద్దల సమక్షంలో నిర్ణయం తీసుకుంటామన్నారు. అప్పటివరకు ఏ ఒక్కరు కూడా ఆసుపత్రికి వెళ్ళవద్దని సూచించారు.

## ఆర్థిక అక్షరాస్యత అవగాహనపై కళాజాత

**నవతెలంగాణ-పుల్కల్**



పుల్కల్ మండలం ఇసాజీపేట గ్రామంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ సిబ్బంది కళాబందం ఆర్థిక అక్షరాస్యతపై కళాజాతా నిర్వహించారు. ఆట పాటలతో అర్థమయ్యే రీతిలో తమ బ్యాంకు ద్వారా అనేక రకాల లాభాలను ప్రతి ఒక్కరు ఎలా పొందాలనే దానిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇన్సూరెన్స్, తక్కువ వడ్డీలకే రుణాలు, డిజిటల్ లావాదేవీల గురించి విభూది బ్రదర్స్ కళాజాతా వారు మ్యాజిక్ షో ద్వారా అవగాహన కల్పించారు. ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు రుణాలు తీసుకోకుండా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ సుదర్శన్ ఎఫ్ ఎల్ సి ప్రవీణ్ కుమార్ ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాస్ రఘు బ్యాంకు మిత్ర భవాని కళాజాతా బృందం సభ్యులు పాల్గొన్నారు.

## నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

**నవతెలంగాణ-కొండాపూర్**



వికలాంగుల జాతీయ హక్కుల వేదిక క్యాలెండర్ ను కొండాపూర్ ఎంపీపీ మనోజ్ రెడ్డి బుధవారం తమ కార్యాలయంలో ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా డివిజన్ కార్యదర్శి వెంకయ్య, కొండాపూర్ మండల ప్రెసిడెంట్ సుధాకర్,ఎస్ఎఫ్ఐ మండల కన్వీనర్ వాణి పాల్గొన్నారు..


## శ్రీ వాగ్దేవి హై స్కూల్ లో ఘనంగా సరస్వతి పూజ

**నవతెలంగాణ-ఐడిఎ బొల్లారం**



వసంత పంచమి పురస్కరించుకుని బొల్లారంలోని శ్రీ వాగ్దేవి హై స్కూల్ లో ఘనంగా సరస్వతి పూజ నిర్వహించారు. బుధవారం శ్రీ వాగ్దేవి హై స్కూల్ కరస్పాండెంట్, తెలంగాణ రాష్ట్ర గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ భాస్కర్ రెడ్డి, విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి సరస్వతి పూజ, హెూమం, సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు.ఈ సందర్భంగా కరస్పాండెంట్ ఉదయ్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ 2024-2025 విద్యా సంవత్సరానికి గాను వారం రోజుల పాటు అడ్మిషన్ ఫీజు లేకుండా పూర్తి గా ఉచితంగా అడ్మిషన్ చేసుకోవడం జరుగుతుందన్నారు.

## పుల్కల్ నూతన ఎస్సైగా శ్రీకాంత్



**నవతెలంగాణ -పుల్కల్**

పుల్కల్ నూతన ఎస్సైగా శ్రీకాంత్ బుధవారం పదవి బాధ్యతలు చేపట్టారు వీరు సంగారెడ్డి జిల్లా కంది మండలంలో పనిచేశారు అక్కడినుండి బదిలీపై పుల్కల్ కు వచ్చారు అనంతరం పదవీ బాధ్యతలు చేపట్టి సిబ్బందితో పుల్కల్ ఉమ్మడి మండల పరిస్థితిపై సమీక్షించారు అనంతరం ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణ పట్ల ఏ ఒక్కరు నిర్లక్ష్యం వహించ రాదన్నారు.

## పుల్కల్ ఎంపీడీవో గా సిహెచ్ ఆనంద్ మేరీ

**నవతెలంగాణ -పుల్కల్**



పుల్కల్ మండల నూతన ఎంపీడీవో గా నియమితులైన ఆనంద్ మేరీ ఇంతకుముందు మెదక్ జిల్లా నార్సింగ్ మండలంలో పనిచేశారు. అనంతరం అక్కడి నుండి బదిలీపై పుల్కల్ మండలానికి వచ్చారు. ఆనంద్ మేరీ బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమెను కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి తమ విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదన్నారు పలు రకాల పనుల మీద మండల కార్యాలయానికి వచ్చిన ప్రజలకు వెంటనే వారి సమస్యలను పరిష్కరించే దిశగా సిబ్బంది పని చేయాలన్నారు. మండలాన్ని అభివృద్ధి బాటలో నడిపేందుకు తమ శక్తి మేరకు పని చేస్తామన్నారు తమకు ప్రజలు సహకరించి గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకోవాలన్నారు

## కొండాపూర్ ఎంపీడీవో గా బాధ్యతలు స్వీకరణ

**నవతెలంగాణ-కొండాపూర్**



సార్వత్రిక ఎన్నికల దష్ట్యా కొండాపూర్ ఎంపిడిఓ గా జీ.జ్యోతిలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె నల్గొండ జిల్లా మిర్యాలగూడ నుంచి బదిలీపై కొండాపూర్ వచ్చారు. కొండాపూర్ లో ఎంపీడీఓగా పనిచేస్తున్న ఎం.మధులత నర్సాపూర్ కి బదిలీపై వెళ్లారు. మండల కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. ఎంపీపీ మనోజ్ రెడ్డి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు శుభాకాంక్షలు తెలియజేస్తూ సన్మానించారు.

## నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు

- మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఇప్ప రాంరెడ్డి అభినందనలు

**నవతెలంగాణ-గుమ్మడిదల :**



తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అవస్థలు పడుతున్న నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించడం పట్ల మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఇప్ప రాంరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలలకే 15,750 వివిధ శాఖల ఉద్యోగ నియామకాల భర్తీ ప్రక్రియను విడుదల చేసినందుకు ఆయన అభినందనలు తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపడంలో నిరుద్యోగుల పాత్ర కీలకమని అన్నారు.

## జహీరాబాద్ ఎస్ఐగా లక్ష్మారెడ్డి



**నవతెలంగాణ-జహీరాబాద్**

జహీరాబాద్ ఎస్సైగా లక్ష్మారెడ్డి పదవి బాధ్యతలు చేపట్టారు. పదవి బాధ్యతలు చేపట్టిన అనంతరం జిల్లా ఎస్పీను కలిసి వచ్చినట్టు లక్ష్మారెడ్డి తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణకు శాయ శక్తులా కృషి చేస్తానని అన్నారు. ఎవరైనా ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే నేరుగా పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి పోలీసులు తమ సిబ్బంది ఉన్నారని చట్టానికి ఎవరు కూడా చుట్టాలు కాదన్నారు. ఎవరైనా చట్టాన్ని చేతుల్లో తీసుకుంటే చట్టపరంగా చర్యలు తప్పవని అన్నారు.

## వీరభద్ర స్వామిని దర్శించుకున్న సంజీవరావు పాటిల్

**నవతెలంగాణ-కల్హేర్**



వసంత పంచమి సందర్భంగా సిర్గాపూర్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సంజీవరావు పాటిల్ కుటుంబంతో కలిసి వీరభద్ర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ప్రమాదంలో సామాగ్రి దగ్ధం

- మంటలు ఆర్పిన అగ్నిమాపక సిబ్బంది

**నవతెలంగాణ-జహీరాబాద్**




జహీరాబాద్ పట్టణంలోని మాణిక్ ప్రభు వీధిలో జరిగిన విద్యుత్ ప్రమాదంలో ఇంటి సామాగ్రి తో పాటు సోఫాలు కాలిపోయినట్లు అగ్నిమాపక అధికారి అధికారి ప్రశాంత్ తెలిపారు. బుధవారం మాణిక్ ప్రభు వీధిలోని శివరాజ్ ఇంట్లో విద్యుత్ బోర్డ్ నుండి మంటలు వచ్చి సోఫా సెట్ పై పడటంతో దట్టమైన పొగలు అలుముకున్నాయి. దీంతో చుట్టుపక్కల వారు ఫైర్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో తక్షణమే అక్కడికి వెళ్లి మంటలు ఆర్పినట్లు తెలిపారు. ఆ సమయంలో ఆ గదిలో ఖాళీ గ్యాస్ సిలిండర్ మాత్రమే ఉంది. పెను ప్రమాదం తప్పిందన్నారు. ఈ కార్యక్రమంలో ఫైర్ అధికారులు నరసింహారెడ్డి, శ్రీనివాసరెడ్డి ,యాదగిరి, యూనస్ పాల్గొన్నారు.

## జహీరాబాద్ ఎంపీడీవో గా మహేందర్ రెడ్డి



**నవతెలంగాణ - జహీరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న బదిలీల్లో భాగంగా జహీరాబాద్ ఎంపీడీవో సుమతి బదిలీ అయిన విషయం తెలిసిందే. ఆమె స్థానంలో ఎంపీడీవోగా మహేందర్ రెడ్డి నల్గొండ జిల్లా తిప్పర్తి మండలం నుండి జహీరాబాద్ కు బదిలీ పై వచ్చారు. బుధవారం పదవి బాధ్యతలు చేపట్టారు.

# ప్రభుత్వ ఆసుపత్రి కార్మికులకు పెరిగిన వేతనం అమలు చేయాలి

- కాంట్రాక్ట్ వ్యవస్థను పూర్తిగా రద్దు చేయాలి : యాదగిరి

**నవతెలంగాణ-సంగారెడ్డి**



ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు పెరిగిన వేతనం అమలు చేయాలని కాంట్రాక్ట్ వ్యవస్థ పూర్తిగా రద్దు చేయాలని మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాసుపత్రి లో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు ఈనెల 16న జరిగే సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎం యాదగిరి మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంటాక్ట్ కార్మికులకు పెరిగిన వేతనం అమలు కావడం లేదని అన్నారు. కాంట్రాక్టు వ్యవస్థ పూర్తిగా రద్దు చేయాలని ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. అన్ని హాస్పిటల్స్ లో ప్రభుత్వం నిర్ణయించిన రూ.15,600/-లలో కార్మికుడికి రూ.12,093/-లు చెల్లించి మిగిలినవి పిఎఫ్, ఈఎస్ఐ ఖాతాలలో జమ చేయాల్సి ఉంది. కానీ కాంట్రాక్ట్ సంస్థలు అన్నీ కుమ్మక్కై రాష్ట్రవ్యాప్తంగా రూ.10,500/-లు, రూ.11,000/-లు మాత్రమే చెల్లిస్తున్నారు. లక్షల రూపాయలు కార్మికుల డబ్బు కాజేస్తున్నారు అని అన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం చెల్లించే విధంగా హాస్పిటల్స్ అధికారులకు, కాంట్రాక్టర్లకు తగిన ఆదేశాలు ఇవ్వాలని అన్నారు..ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు యాదగిరి, కిరణ్, శోభ, మరియమ్మ, రమాదేవి, అలీమా, రత్నయ్య సునీత, అనిత, నిఖిత, రాజు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ కాలనీ అభివృద్ధి ఇన్నాళ్లకు గుర్తుకు వచ్చిందా?

- ముందు బీసీ కాలనీ ప్రజలకు క్షమాపణ చెప్పాలి
- మాజీ జడ్పీటీసీకి రెండోవార్డు కౌన్సిలర్ హెచ్చరిక

**నవతెలంగాణ-ఐడిఎ బొల్లారం**

ఇన్నాళ్లు బిసి కాలనీ అభివృద్ధి గురించి అసలు పట్టించుకోని మాజీ జెడ్పీటీసీ కొలన్ బాల్ రెడ్డికి ఉన్నట్టుండి ఒక్కసారిగా బిసి కాలనీపై ప్రేమ ఎందుకు కురిపిస్తున్నారో అర్థం కావడం లేదని రెండో వార్డు కౌన్సిలర్ వారాల గోపాలమ్మ వెంకటయ్య అన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ తమ వార్డు లో పర్యటించి అభివృద్ధి చేస్తామని చెప్పడం వెనుక రాజకీయ దురుద్దేశం ఉంది తప్ప మరో ఎజెండా లేదని విమర్శించారు. మాజీ జెడ్పిటిసి కొలన్ బాల్ రెడ్డి కి ఈ సందర్భంగా ఆమె సవాల్ విసిరారు. బీసీ కాలనీ ప్రజలకు క్షమాపణ చెప్పి బీసీ కాలనీకి రావాలని కోరారు. బీసీ కాలనీ 1983లో బొల్లారం గ్రామపంచాయతీ కాకముందు కాలనీగా ఏర్పడిందని కానీ ఈరోజు వరకు ఎలాంటి అభివృద్ధి కి నోచుకోలేదని దాదాపు 20 సంవత్సరాల నుంచి బొల్లారంలో పదవులు అనుభవిస్తూ, బొల్లారాన్ని ఏలుతున్న కొలన్ బాల్ రెడ్డి బీసీ కాలనీలో ఎందుకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు కట్టలేదో చెప్పాలన్నారు. సిసి రోడ్లు, మంచినీటి కనెక్షన్ లేదో ఎందుకు వేయలేదు అని ప్రశ్నించారు. 59 జీవో రెగ్యులరైజేషన్ ఏమైందన్నారు. పూర్తిగా విద్యుత్ స్తంభాలు, లోకల్ వాటర్ కనెక్షన్ లేవన్నారు. సర్వే నెంబర్ 44లో ముగ్గురికి మాత్రమే జరిగిన రెగ్యులరైజేషన్ మిగతా వారికి ఎందుకు జరగలేదో చెప్పాలన్నారు. సర్వే నెంబర్లు 44లో ఎకరా పదమూడు వందల గజాలు రెగ్యులరైజేషన్ ఎలా అయిందని ప్రశ్నించారు. మీ ఫ్యామిలీలో అందరికీ 59 జీవో కింద ఎలా రెగ్యులరైజేషన్ అయింది. మిగతా ప్రజలకు ఎందుకు కాలేదన్నారు. ఏ ఒక్కటీ చేయనందుకు ముందుగా ప్రజలకు ముందుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తాను కౌన్సిలర్ అయిన తర్వాత అడిషనల్ కలెక్టర్‌ను( లోకల్ బాడీ ) ఆహ్వానించగా, ప్రతి గల్లీని చూసి, కమిషనర్, చైర్ పర్సన్‌ను మందలించి బీసీ కాలనీకి కనీస సౌకర్యాలు కల్పించాలని ఆదేశించి వెళ్లారని అన్నారు. దాదాపు అండర్ గ్రౌండ్ డ్రైనేజీకు ఎస్ డి ఎఫ్ నిధులు ద్వారా 65 లక్షల రూపాయలు, సాధారణ నిధుల నుండి దాదాపు ముప్పై లక్షల రూపాయలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మూడు బోర్లు వేయించామని, మూడు బోర్లు రీఫిలింగ్ చేయించామన్నారు. ఒక బోరు వి చంద్రా రెడ్డి సహకారంతో తొంబై ఐదు వేల రూపాయల ఖర్చుతో రీ ఫిల్లింగ్ చేయించామన్నారు. రోడ్డుకు అడ్డంగా పెద్ద బండరాయి ఉంటే చంద్రారెడ్డి సహకారంతో నాలుగు లక్షల 85 వేల రూపాయలతో తీయించాని తెలిపారు.



ఎల్లమ్మ టెంపుల్ పునర్నిర్మాణము చేయడానికి 5 లక్షల రూపాయలతో వి చంద్రారెడ్డి సహకారంతో నిర్మాణము చేశామన్నారు.. గణేష్ మండపాన్ని నిర్మించామన్నారు. స్కూల్ నిర్మాణానికి దాదాపు రెండు విడతలుగా 45 లక్షల ఖర్చుతో డెవలప్మెంట్ చేయడం జరిగిందన్నారు. బొల్లారం గ్రామపంచాయతీ ఉన్నప్పటి నుండి మున్సిపల్ అయ్యే వరకు దాదాపు 20 ఏండ్ల పాటు వందల కోట్ల నిధులు వచ్చినా బీసీ కాలనీ అభివృద్ధిని ఎందుకు పట్టించుకోలేదన్నారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సహకారంతో కొన్ని పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. బొల్లారం మున్సిపాలిటీ 32 బూతులలో బీసీ కాలనీలోని 92 బూత్ నెంబర్ లోనే గూడెం మహిపాల్ రెడ్డి కి అధిక మెజారిటీ వచ్చిందన్నారు. ఈ మధ్యనే ఎమ్మెల్యే సహకారంతో నాలుగు వెంచర్లలో వీధిలైట్లకు విద్యుత్ మీటర్లను ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. మిషన్ భగీరథ పనులు 90శాతం పూర్తి చేసినట్టు తెలిపారు. మెయిన్ లైన్ పెండింగ్ లో ఉన్నది. ఇది కొందరు ప్రైవేటు వ్యక్తులు అడ్డుకోవడం వల్ల ఆగిపోయిందన్నారు. ఈ సమస్య ఎందుకు పరిష్కారం చేయలేదో కొలన్ బాల్ రెడ్డి చెప్పాలన్నారు. ఎస్ డి ఎఫ్ నిధులు ప్రభుత్వం మారడం వల్ల కొద్దిగా ఆలస్యం అయ్యిందని, వాటితో ఇప్పటికే మంజూరు అయి ఉన్న 91 లక్షల రూపాయలు తో సిసి రోడ్డు నిర్మాణం, 30 లక్షల రూపాయల ఖర్చుతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

# కులాంతర వివాహాలను ప్రభుత్వాలు ప్రోత్సహించాలి

- కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్

**నవతెలంగాణ-సంగారెడ్డి**

కులాంతర ఆదర్శ వివాహం చేసుకున్న శృతి రాజ్ దంపతులను కెవిపిఎస్ ఆధ్వర్యంలో అభినందిస్తూ సన్మానించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్ మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేని కుల వ్యవస్థ భారత దేశంలో ఉందని అన్నారు. దేశంలో కుల నిర్మూలన జరగాలని జ్యోతిరావు పూలే అంబేద్కర్ కమ్యూనిస్టులు నాస్తిక వాదులు అనేకమంది మహనీయులు కుల నిర్మూలన కోసం ప్రాణాలు త్యాగం చేశారని అన్నారు. కులాంతర మతాంతర వివాహాలు ఆదర్శమైనవిగా గుర్తించాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కులాంతర వివాహాలు చేసుకున్న వారిపై దాడులు హత్యలు జరుగుతున్నాయని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం వీరి కోసం ప్రత్యేకమైన రక్షణ చట్టం తీసుకురావాలని అన్నారు. వీరికి ప్రభుత్వ రక్షణ కల్పించాలని కులాంతర వివాహం చేసుకున్న వారికి జీవో 12 ప్రకారం 2,50,000 ఇవ్వాలని, కానీ నేటికీ జిల్లాలో కులాంతర వివాహం చేసుకుంటే జంటలకు ఆర్థిక సహాయం అందలేదన్నారు. వెంటనే ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇల్లు పథకం కింద ఒక ఇల్లు పది లక్షల రూపాయలు ప్రభుత్వ ఉద్యోగం, ఉద్యోగాలలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు పి. అశోక్ జిల్లా సహాయ కార్యదర్శి ప్రవీణ్, జిల్లా కమిటీ సభ్యులు దాసు తదితరులు పాల్గొన్నారు.



# ఆందోల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా

- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

**నవతెలంగాణ -పుల్కల్:** ఆందోల్ నియోజక వర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి చూపిస్తామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. చౌటాకుర్ మండల కేంద్రంలో కుడి చెరువు నుండి నాయిని చెరువు వరకు మెటల్ రోడ్డు మంజూరు చేసి బుధవారం ఆయన భూమి పూజ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మండలంలో ఎవ్వరు చేయలేని పనులు తమ హయాంలో చేసి చూపిస్తామని ఆయన అన్నారు. ఇప్పటివరకు పాలించిన పాలకులు స్వార్థ ప్రయోజనాల కోసం పనిచేశారే తప్ప ప్రజల కష్ట సుఖాల గురించి ఏనాడూ ఆలోచించలేదన్నారు అన్యకాంతంగా ఎక్కడబడితే అక్కడ విచ్చలవిడిగా భూ కబ్జాలకు పాల్పడుతూ ఆందోల్ నియోజకవర్గ ప్రజలకు తీవ్ర మోసం చేశారని ఆయన మండిపడ్డారు అవినీతికి పాల్పడ్డ బిఆర్ఎస్ నాయకుల భరతం పడతామన్నారు. అమాయక ప్రజలను మోసం చేసి ధనార్జనే ధ్యేయంగా పనిచేసిన బి ఆర్ ఎస్ నాయకులకు తగిన గుణపాఠం చెబుతామన్నారు. ఇచ్చిన ఆరు గ్యారెంటీలను నెరవేర్చి తీరుతామన్నారు రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా బిజెపిని చిత్తుచిత్తుగా ఓడించి కేంద్రంలో తమ నాయకుడు రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా కేంద్రంలో తమ ప్రభుత్వమే అధికారం చేపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో చౌటకూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నత్తి దశరథ్ పార్టీ నాయకులు రాజిరెడ్డి జయరాం రెడ్డి శివంపేట ఎంపీటీసీ కిరణ్ గౌడ్ ఆయా గ్రామాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



# జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ చాటిన అల్గోల్ మైనార్టీ గురుకుల విద్యార్థులు

**నవతెలంగాణ-జహీరాబాద్:** జేఈఈ మెయిన్స్ తొలి విడత ఉమ్మడి ప్రవేశ పరీక్షలో అల్గోల్‌లో గల తెలంగాణ మైనార్టీ బాలుర గురుకుల విద్యార్థులు ఎల్.పవన్ కిరణ్ (హాల్ టికెట్ నెంబర్- 01038282) , టి. జస్వంత్ ( హాల్ టికెట్ నెంబర్ 01079188) అర్హత సాధించి విజయకేతనం వేశారని ప్రిన్సిపాల్స్ జే. రాములు, కె.ఎస్. జమీల్ ఒక ప్రకటనలో తెలిపారు. అంకితభావం గల అధ్యాపకులు మరియు నిష్ణాతులైన పూణేకు చెందిన ఏడీసిఐ ఎన్డీఏ అధ్యాపక బృందం ప్రోత్సాహంతోనే ఈ విజయం సాధ్యమైందని విద్యార్థులు పేర్కొన్నారు. టిమ్రీస్ యొక్క పటిష్టమైన అకాడమిక్ ప్రణాళిక, ప్రోత్సాహం వలన ఈ విజయం సాధ్యమైందని విద్యార్థులు తమ అభిప్రాయాన్ని తెలిపారు.. జే.ఈ.ఈ మెయిన్స్ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులను సన్మానించి అధ్యాపకులు బహుమతి ప్రదానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కోఆర్డినేటర్ నాగార్జున, ఇబ్రహీం, అజ్ర అంజుమ్, భవానీ, శ్రీనివాస్ , నసీర్, సిద్ధప్ప, వార్డెన్ సమియుద్దీన్, జూనియర్ అసిస్టెంట్ ఇర్ఫాన్, సాగర్, పిడి మాజీద్, స్టాఫ్ నర్స్ ఇమ్రాన్, ఆఫీస్ సబార్డినేట్ మునబ్బీర్, బోధన , బోధనేతర సిబ్బంది, నీట్ మరియు ఎన్డీఏ విద్యార్థులు పాల్గొన్నారు.




# 16న జహీరాబాద్‌లో భారీ ప్రదర్శన

- కార్మికులు తరలిరావాలి :
- సిఐటియూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ మహిపాల్
- శ్రామిక్ భవన్‌లో పోస్టర్ విడుదల

**నవతెలంగాణ - జహీరాబాద్**



ఈనెల 16న జరిగే గ్రామీణ బంద్, కార్మికుల సమ్మెలో భాగంగా జహీరాబాద్ పట్టణంలో భారీ ప్రదర్శన సభ నిర్వహిస్తున్నట్లు సిఐటియూ జిల్లా సహాయ కార్యదర్శి మహిపాల్ తెలిపారు. ర్యాలీని, సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బుధవారం శ్రామిక్ భవన్లో గ్రామీణ బంద్, సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మహిపాల్ మాట్లాడుతూ కోట్లాదిమంది ప్రయోజనాలను కొంతమంది పెట్టుబడుదారుల కోసం కేంద్రప్రభుత్వం తాకట్టు పెడుతోందని, ఇది సరైనది కాదని అన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్మిక కర్షక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ యజమాన్యాలకు తొత్తులుగా మారుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మహేంద్ర అండ్ మహేంద్ర, సీఐ ఆటోమోటివ్,రాక్ వూల్, మున్సిపల్, బీసీడబ్ల్యూ, తదితర పరిశ్రమలు, వివిధ రంగాల నాయకులు రాజిరెడ్డి, ఎల్లప్ప ,బాలరాజు, శివరామరావు, సందీప్ రెడ్డి, మొగులయ్య, పాల్గొన్నారు.

## ఘనంగా సేవాలాల్ జయంతి ఉత్సవాలు

**నవతెలంగాణ- నారాయణఖేడ్ రూరల్**



నారాయణఖేడ్ నియోజకవర్గం మున్సిపాలిటీ కేంద్రంలో సంత్ పూజశ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. సేవాలాల్ చౌక్ నుండి తాసిల్దార్ గ్రౌండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి నృత్య ప్రదర్శనలు చేశారు. సేవాలాల్ జయంతికి ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి హాజరై చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....గిరిజనుల ఆరాధ్య దైవమైన సేవాలాల్ మహారాజ్ జయంతి రోజును గిరిజనుల కోరిక మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి సెలవుదినంగా ప్రకటించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ గిరిజన నాయకులు, అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్ చౌహాన్ రవీందర్ నాయక్ ప్రకాష్ రాథోడ్ శివ రాథోడ్ తుకారం నాయక్ నెహ్రూ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులతో పంచవటి క్షేత్రం కిటకిట

**నవతెలంగాణ-న్యాల్‌కల్**



వసంత పంచమి సందర్భంగా న్యాల్‌కల్ మండలంలోని రాఘవపూర్ శివారులో శ్రీ సరస్వతి పంచవటి క్షేత్రం చిన్నారులు, భక్తులతో కిటకిటలాడింది సరస్వతి క్షేత్రం కాశీనాథ్ బాబా పీఠాధిపతి పర్యవేక్షణలో పూజలు జరిగాయి ఆలయం వద్ద ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జహీరాబాద్ రూరల్ సీఐ నోముల వెంకటేష్ పటిష్ట భద్రత చర్యలు చేపట్టారు వసంత పంచమి సరస్వతి ఆలయంలో బాగారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ తరపున అక్షరాభ్యాసం కార్యక్రమం ఐదు సంవత్సరాల చిన్నారులకు నిర్వహించారు రాఘవపూర్ పంచవటి క్షేత్రం ఆలయంలో మాజీ డిసిసిబి చైర్మన్ బిజెపి రాష్ట్ర నాయకుడు జైపాల్ రెడ్డి తరఫున వెయ్యి మంది చిన్నారులకు అక్షరాభ్యాసం పూజ సామాగ్రి కిట్లు సమకూర్చారు అక్షరాభ్యాసం నిర్వహించారు ఈ కార్యక్రమంలో నాయకులు మోహన్ రెడ్డి , ఓంకార్ , విష్ణువర్ధన్ రెడ్డి ,తదితరులున్నారు ....

## పలు కార్యక్రమాలలో డిసిసి ప్రధాన కార్యదర్శి..

**నవతెలంగాణ-కల్హేర్,**



నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి సోదరుడు డిసిసి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి బుధవారం సిర్గాపూర్ మండలంలోని చీమల్‌పాడ్‌లో దీంగబర్ రావ్ కుమారుడి నూతన వస్త్రాధారణ, నూతన గృహప్రవేశం కార్యాక్రమంలో పాల్గొన్నారు. చిన్నారులను ఆశీర్వదించారు. దీంగబర్‌రావ్‌కు, వారి కుటుంబ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. కద్బాల్ గ్రామంలో వెంకటేశ్వర స్వామి కళ్యాణం వేడుక కార్యక్రమానికి హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సల్మాన్ మాజీ సర్పంచ్.జ్ఞాను పటేల్. నాగశెట్టి. సంజీవ రెడ్డి .జానీ పటేల్. అల్లభక్షి రాజు శ్రీకాంత్. షారుఖ్ , మాజీ సర్పంచ్ యాదవ్ రెడ్డి. విఠల్ రెడ్డి. సంగమేష్.రాంరెడ్డి పటేల్ .జానీ పటేల్. అల్లభక్షి రాజు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ విద్యా సరస్వతి మాతా దేవాలయంలో వసంత పంచమి

**నవతెలంగాణ-సంగారెడ్డి**



వసంత పంచమి సందర్భంగా సంగారెడ్డి డ్రైవర్స్ కాలని సరస్వతినగర్ లోని శ్రీ విద్యాసరస్వతి మాతా దేవాలయంలో ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చనలు, చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమలు ఆలయ అర్చకులు మీనా నాద్ శర్మ ఆధ్వర్యంలో ఆలయ ధర్మ కర్తలు కొడిదే లింగమ్మ, యాదగిరి, ఆలయ కమిటీ సభ్యులు శ్రీధర్ మహేంద్ర, మహేష్ కుమార్, వినయ్, రాజు పాల్గొన్నారు

## నూతన ఎంపీడీవో ఉమాదేవి బాధ్యతల స్వీకరణ

**నవతెలంగాణ-గుమ్మడిదల :**



గుమ్మడిదల మండల నూతన ఎంపీడీవో గా ఉమాదేవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు గత కొన్ని సంవత్సరాలుగా పనిచేసిన ఎంపీడీవో చంద్రశేఖర్ నల్గొండ జిల్లాకు బదిలీ అయినారు. నూతనంగా విచ్చేసిన ఎంపీడీవో ఉమాదేవిను గుమ్మడిదల తాజా మాజీ సర్పంచ్ తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు శాలువాతో సన్మానం చేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ చిమ్ముల నరసింహారెడ్డి మాట్లాడుతూ మండలంలో ఉన్నటువంటి సమస్యల పట్ల ప్రత్యేక దృష్టి సారించి జిల్లా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు

## ప్రతిభ విద్యానికేతన్‌లో ఘనంగా వసంత పంచమి వేడుకలు

**నవతెలంగాణ-జిన్నారం**



జిన్నారంలోని ప్రతిభ విద్యానికేతన్ హైస్కూల్లో బుధవారం వసంత పంచమి వేడుకలు ప్రిన్సిపల్ సార శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజ చేశారు. వసంత పంచమి విశిష్టతను వివరిస్తూ వివిధ కార్యక్రమాలను విద్యార్థి బందం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సార శ్రీనివాస్ మాట్లాడుతూ జ్ఞానానికి పదును పెడుతూ సృజనాత్మకతతో విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

## ఆలయాన్ని దర్శించుకున్న పలు పార్టీల నాయకులు

**నవతెలంగాణ-న్యాల్‌కల్**



మండలంలోని న్యామత బాద్ గ్రామంలో హనుమాన్ మందిర ఆలయంలో చివరి రోజు పూజలు ఘనంగా ముగిసాయి వివిధ పార్టీల నాయకులు హాజరయ్యారు. ఆలయాన్ని సందర్శించి పూజలో పాల్గొన్నారు. ఆశ్రమ పీఠాధిపతులు బర్దిపూర్ అవధూత గిరి మహారాజ్, శివచార్యస్వామి ధనశ్రీ, దేవగిరి మహారాజ్, అంబికా శివయోగిస్వామి, చెన్నమల్లికార్జునస్వామి, రంజోల్‌రాజయ్యస్వామి, ముక్తాబాయ్ మాత శబరిమాత, పీఠాధిపతులు పాల్గొన్నారు.

## గీతం స్కాలర్ మాలతికి పీహెచ్‌డీ

**నవతెలంగాణ-పటాన్‌చెరు**



గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని విసారపు మాలతిని డాక్టరేట్ వరించింది. 'వన్-పాట్ త్రీ-కాంపోనెంట్ సింథటిక్ విధానాల ద్వారా పైరాన్ ఫ్యూజ్డ్ హెటెరోసైక్లిక్ సమ్మేళనాల సంశ్లేషణ' అనే అంశంపై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లోని రసాయన శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.నారాయణరెడ్డి బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఒక పాట్ మూడు భాగాల ప్రతిచర్యలను మాలతి అభివృద్ధి చేసి, ఆమోదయోగ్యమైన ప్రతిచర్య విధానాన్ని ప్రతిపాదించినట్టు తెలిపారు. మాలతి సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్ డీ పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం విశ్వవిద్యాలయం, హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ఇన్చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పలువురు ఈ సందర్భంగా ఆమెను అభినందించారు.

## 16న జరిగే దేశవ్యాప్త సమ్మె పోస్టర్ విడుదల

**సీఐటీయూ మండల కార్యదర్శి గౌరీ**
**నవతెలంగాణ-వెల్దుర్తి**



16న జరిగే దేశవ్యాప్త సమ్మె పోస్టర్‌ను మండల కేంద్రంలో పిఎసిఎస్ కార్యాలయం వద్ద హమాలి కార్మికులతో కలిసి బుధవారం సీఐటీయూ మండల కార్యదర్శి గౌరీ విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి గౌరీ మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మికులను పట్టించుకోవడం లేదన్నారు. అసంఘటితరంగ కార్మికుల ఐక్యత, హక్కుల కోసం ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయడానికి కార్మిక వర్గాలు అదరూ పాల్గొనాలని కోరారు. మండల కేంద్రంలో జరిగే భారీ ర్యాలీలో గ్రామపంచాయతీ కార్మికులు హమాలి కార్మికులు భవన నిర్మాణ కార్మికులు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారి నిబంధనలు పాటించాలి

**నవతెలంగాణ-పెద్దశంకరంపేట**



161వ జాతీయ ప్రధాన రహదారిపై వెళ్లే సమయంలో నిబంధనలు తప్పకుండా పాటించాలని ఎస్ఐ శంకర్, శంకరంపేట ప్రాజెక్ట్ హెడ్ ప్రభాకర్ రెడ్డి, నేషనల్ హైవే ప్రాజెక్ట్ ఇంజనీర్ రెహమాన్లు అన్నారు. జాతీయ రహ దారి భద్రత వారోత్సవాల సందర్భంగా బుధవారం పెద్దశంకరంపేట మండలం కోలాపల్లి పాత టోల్‌ప్లాజా వద్ద క్యూబ్ హైవేస్ అధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైవర్లకు, ప్రయాణీకులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ప్రజలు ప్రయాణించే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, రాంగ్‌రూట్లో వెళ్లవద్దని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఎస్ మేనేజన్ మోయినొద్దిన్, పీఆర్టీఓ శివ తదితరులున్నారు.

## ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

**నవ తెలంగాణ-టేక్మాల్**



మండలంలో ప్రసిద్ధి గాంచిన షహదల దర్గా 196వ ఉర్సు ఉత్సవాల్లో మంత్రి దామోదర్ రాజ నర్సింహ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తెలంగాణ ప్రభుత్వంలో దర్గా అభివృద్ధిని మరిచిందన్నారు. దర్గా అభివృద్ధి కోసం తన వంతు శాయశక్తుల కృషి చేస్తానని చెప్పారు. టేక్మాల్ దర్గాకు ఒక ప్రత్యేకత ఉందని కుల మతాలకతీతంగా ఈ ఉత్సవాల్లో పాల్గొంటారన్నారు. అనంతరం మత గురువుల ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో షేక్ బజార్, నిమ్మ రమేష్, భక్తుల కిషోర్, సాగర్, చైతగిరి కిష్టయ్య, శ్రీధర్ ఆచారి, సత్యం తదితరులు ఉన్నారు

## మహమ్మద్ నగర్ రూ.5 లక్షలు మంజూరు

**నవతెలంగాణ-కౌడిపల్లి**



మహమ్మద్ నగర్ గ్రామపంచాయతీకి రూ.5 లక్షలు మంజూరయ్యాయని కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు రఘు పటేల్ తెలిపారు. మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద సిసి రోడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయని తెలిపారు. వీటిని ప్రత్యేక అధికారులు పంచాయతీ కార్యదర్శులు తీర్మానం చేసి పంపాలని ఆయన సూచించారు.

## డీఎస్పీ అకస్మిక తనిఖీ

**నవతెలంగాణ-చిన్న శంకరంపేట**



బుధవారం చిన్న శంకరంపేట పోలీస్ స్టేషన్‌ను తూప్రాన్ డీఎస్పీ నామ వెంకట్ రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

## వసంత పంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు

**విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నుల అందజేత**
**నవతెలంగాణ-వెల్దుర్తి**



చిన్నారులకు జ్ఞానం ప్రసాదించే భక్తుల కోరిన కోరికలు తీర్చే మహిమాన్విత తల్లి సరస్వతి దేవిని మండల కేంద్రానికి చెందిన కట్టెల రమేష్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో సరస్వతి దేవి విగ్రహ ప్రతిష్టాపన చేసిన మొదలుకొని ప్రతి ఏటా వసంత పంచమి రోజున ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. బుధవారం వసంత పంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి పాఠశాలలో చదివే విద్యార్థిని విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను పెన్నులను అందజేశారు. సరస్వతి కటాక్షం ఉంటే లక్ష్మీ కటాక్షం సిద్ధిస్తుందని అన్నారు.

## వెంకటేశ్వర ఆలయంలో అన్నదానం

**నవతెలంగాణ-రామాయంపేట**



ఏకాదశ బ్రహ్మోత్సవాలు సందర్భంగా నాలుగో రోజు బుధ వారం వెంకటేశ్వర ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. హెూమం, బలిహ రనస్వామి కల్యాణంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, ఆలయదాతలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సేవాలాల్ 285 జయంతిని విజయవంతం చేయాలి

**నవతెలంగాణ-నార్సింగి**



సేవాలాల్ 285 జయంతిని విజయవంతం చేయాలని మండల పరిధిలోని పెద్ద తండా చెందిన బీక్యా నాయక్, వసురాం, బాషా నాయక్, సోమ్లా నాయక్‌లు కోరారు. ఈ నెల 15న పెద్ద తాండాలో సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించనున్నామని తెలిపారు. ఉదయం 10:30 నిమిషాలకు పెద్ద తాండాలో కార్యక్రమాలు ప్రారంభం అవుతాయని, బైక్ ర్యాలీ, సాంస్కృతిక కార్యక్రమం, జగదంబ దేవి జెండావిష్కరణ, అన్న దాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలు, నాయకులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## గరుడ గంగా తీరాన అక్షరజ్యోతి

**అక్షరాబ్యాసం చేసిన చిన్నారులు**
**ఆధ్యాత్మికతను సంతరించుకున్న సరస్వతీ ఆలయం**
**నవతెలంగాణ-మెదక్**



మెదక్ మండలం పేరూరు శివారులో గరుడ గంగా మంజీరా తీరాన కొలువుదీరిన శ్రీ సరస్వతి ఆలయం 21వ వార్షికోత్సవాలను పురస్కరించుకొని బుధవారం వసంత పంచమి సందర్భంగా చిన్నారులకు అక్షరాబ్యాసం నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారులు దోర్బల రాజమౌళిశర్మ, మహేష్‌శర్మల మంత్రోచ్చరణల మధ్య తల్లిదండ్రులు చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. పలక బలపం పట్టి చిన్నారులు అక్షరాబ్యాసాన్ని మొదలుపెట్టారు. భక్తులు వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. పూజారుల మంత్రోచ్చరణలు, భక్తులు తాకిడి వల్ల సరస్వతి ఆలయం అధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఓడిబియ్యాలు, యజ్ఞం, గోత్రనామార్చనలు జరిగాయి. ఆలయ ప్రాంగణంలో ఉన్న మహా గోశాలలో భక్తులు పూజలు చేశారు. సాయంత్రం బండ్ల ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు ఎడ్ల బండ్లను ఆలయ చుట్టు ఊరేగించి మొక్కుకున్నారు.

## నిజాయితీ చాటుకున్న 108 సిబ్బంది

**ప్రమాద క్షతగాత్రుని వద్ద నాలుగు లక్షల నగదు**
**పోలీసులకు అప్పగించిన 108 సిబ్బంది**
**నవతెలంగాణ-రామాయంపేట**





రోడ్డు ప్రమాదం జరిగి గాయాల పాలైన క్షతగాత్రుడి వద్ద ఉన్న రూ.4 లక్షల నగదును పోలీసులకు అప్పగించి 108 సిబ్బంది నిజాయితీని చాటుకున్నారు. నార్సింగి మండలానికి చెందిన ఎర్రం శ్రవణ్ కుమార్ అనే ధాన్యం వ్యాపారి దగ్గర గుమస్తాగా పనిచేస్తున్న నరేష్ అనే వ్యక్తి, సిద్దిపేట నుంచి రూ4 లక్షల నగదును తీసుకొని నార్సింగి వెళ్తుండగా రామాయంపేట బైపాస్ వద్ద రోడ్డు ప్రమాదం జరిగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గాయపడ్డ క్షతగాత్రున్ని ఆసుపత్రికి తరలించడానికి వచ్చిన 108 సిబ్బంది ఆసీఫ్, స్వామిలు అతని వద్ద రూ. 4 లక్షల నగదును గమనించారు. గాయపడ్డ వ్యక్తిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, నగదును పోలీసులకు అప్పగించారు. పోలీసులు రూ. 4 లక్షల నగదును నార్సింగి మండలానికి చెందిన ధాన్యం వ్యాపారి శ్రావణ్ కుమార్‌కు అందజేశారు. నిజాయితీతో క్షతగాత్రుల వద్ద ఉన్న రూ. 4 లక్షలను పోలీసులకు అప్పగించిన 108 సిబ్బంది ఆసిఫ్, స్వామీలను పలువురు అభినందించారు.

## వెంకటేశ్వర ఆలయంలో అన్నదానం

**నవతెలంగాణ-రామాయంపేట**



ఏకాదశ బ్రహ్మోత్సవాలు సందర్భంగా నాలుగో రోజు బుధవారం వెంకటేశ్వర ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. హెూమము, బలిహరనస్వామి కల్యాణంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, ఆలయదాతలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజాశ్రేయస్సు.. అభివృద్ధికి కృషి..

- మెదక్ పట్టణంలో మూడు జంక్షన్ల సుందరీకరణ
- ఐ లవ్ మెదక్ సెల్ఫీ పాయింట్ల ఏర్పాటు
- ఏడుపాయలలో రూ. 80 లక్షలతో శాశ్వత షెడ్
- మెదక్ చర్చి అభివృద్ధికి సీఎంతో చర్చిస్తా
- 22 నుంచి కృతజ్ఞత యాత్ర
- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్



**నవతెలంగాణ-మెదక్**

ఓట్లేసి గెలిపించిన ప్రజల శ్రేయస్సు కోసం, మెదక్ నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేయనున్నట్లు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం మెదక్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో బ్రహ్మాండమైన మెజారిటీతో గెలిపించిన ప్రజలను తన కుటుంబ సభ్యులుగా భావించి ఎలాంటి బాధ, ఇబ్బందులు కలుగకుండా సేవా కార్యక్రమాలు, అభివృద్ధి పనులు చేసేందుకు ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే మెదక్ పట్టణంలోని అంబేద్కర్, ధ్యాన్‌చంద్, రాందాస్ మూడు చౌరస్తాలను సుందరీకరణ చేయనున్నట్లు తెలిపారు. అలాగే మెదక్-వెల్కమ్ బోర్డులో ఒకటి, నర్సాపూర్-మెదక్ రూట్‌లో ఒకటి చొప్పున ఐ లవ్ మెదక్ పేరిట రెండు సెల్ఫి పాయింట్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఏడుపాయల అమ్మవారు ఆలయం వద్ద రూ.80 లక్షల వ్యయంతో శాశ్వత షెడ్ నిర్మాణాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం బాత్ రూంలను, వసతి గదులను నిర్మించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మెదక్ చర్చి 100 ఏళ్ళ పూర్తి చేసుకుంటున్న సందర్భంగా సీఎంతో మాట్లాడి ఆలయ అభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు. కాగా ఇటీవల కాలంలో ఎక్కువగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ప్రమాదాలను గురవుతున్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. ప్రజలను తమ కుటుంబ సభ్యులుగా భావిస్తున్నామని, వారి ప్రాణాలు ముఖ్యమనే ఆలోచనతో జిల్లా ఎస్పీతో మాట్లాడి భారీ ఫైన్‌లు వేయకుండా కౌన్సిలింగ్ ఇవ్వాల్సిందిగా సూచించనున్నట్లు తెలిపారు. మెదక్ పట్టణంలోని చిల్డ్రన్స్ పార్క్‌ను అభివృద్ధి చేసేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేగా తాను, మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో తన తండ్రి మైనంపల్లి హన్మంతరావు ప్రజల శ్రేయస్సు కోసం మంచి కోసం సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. ఎన్నికల ముందు, తర్వాత ఒకటి చెప్పలేదని, అన్ని కార్యక్రమాలను అమలు చేస్తామన్నారు. బోర్లు, ఫిక్స్ డిపాజిట్ చేస్తున్నట్లు తెలిపారు. సొంత డబ్బులతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని, అవసరమున్న చోట 100 పివోఈ వాటర్ ప్లాంట్‌ల ను తాగునీటి సౌకర్యం కోసం ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే కొత్తలింగాయ్ పల్లి, ఎస్. కొండాపూర్‌లో ఏర్పాటు చేయడం జరిగిందని, రెండు మూడు రోజుల్లో ప్రారంభిస్తామని తెలిపారు. గతంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, సీఎం ఇలా ఎవరు వచ్చినా వందలు, వేల కోట్లు మాట్లాడి వెళ్లారు కానీ ఒక్క రూపాయి రాలేదన్నారు. మైనంపల్లి మాటల్లో కాదు చేతల్లో చేసి చూపిస్తామని తెలిపారు. గతంలో లాగా తాత్కాలికంగా కాకుండా శాశ్వత నిర్మాణాలను చేపడతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు సంతోషంగా ఉన్నారని, ఈ నెల 22 నుంచి ఓట్లేసి గెలిపించిన ప్రజలను కలిసేందుకు అన్ని గ్రామాలలో పర్యటించి కృతజ్ఞత యాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జానకి సాగర్, నాయకులు ఆంజనేయులు గౌడ్, లింగం, జీవన్ రావు, మంగ మోహన్ గౌడ్, హఫీజ్, నరేందర్, శంకర్, మహేందర్ రెడ్డి, హమీద్, తాహెర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక వ్యవసాయ సాంకేతిక పద్ధతులను అలవర్చుకోవాలి

**కలెక్టర్ రాజర్షి షా**
**నవతెలంగాణ-మెదక్**



ఆధునిక వ్యవసాయ సాంకేతిక పద్ధతులను అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో అగ్రిటెక్ సౌత్ 2024 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి 18 ఫిబ్రవరి వరకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో భారత పరిశ్రమల సమాఖ్య వ్యవసాయ రంగంలో జరుగుతున్న సాంకేతిక అభివృద్ధిని రైతులకు పరిచయం చేయడానికి అగ్రిటెక్ సౌత్-2024 ఎగ్జిబిషన్, సదస్సు నిర్వహిస్తుందన్నారు. అగ్రిటెక్ సౌత్ 2024లో వ్యవసాయ ఉత్పత్తులు వాటి పెంపకం, పునరుత్పత్తి వ్యవసాయం, పశు సంరక్షణ, చేపల పెంపకం, కోళ్ల పెంపకం, ఆయిల్ ఫామ్ సాగు, వ్యవసాయ యాంత్రీకరణ, పోషక భద్రత, ఉద్యాన పంటలు, సమీకృత వ్యవసాయ పద్ధతులు, రైతు ఉత్పావన సంస్థలు, అగ్రీ స్టార్టప్ల గురించి చర్చలు జరుగుతాయని తెలిపారు. ఆయా సంస్థల సాంకేతిక అభివృద్ధి ప్రదర్శన ఎగ్జిబిషన్‌లో జరుగుతాయన్నారు. మూడు రోజులపాటు నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌లో వెయ్యి మంది వ్యవసాయ సంబంధిత ప్రతినిధులతో చర్చ కార్యక్రమం ఉంటుందన్నారు. అదేవిధంగా 150 స్టాల్స్ వివిధ వ్యవసాయ ఉపకరణాలపై రైతులకు అనుభవ కేంద్రంతో పాటుగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి రైతు సందర్శకులు పాల్గొంటారని తెలిపారు. విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ రసాయనాలు, వ్యవసాయ పరికరాలు, పాడి పరిశ్రమ, మత్స్య పరిశ్రమ, సేంద్రియ వ్యవసాయం, వ్యవసాయంలో డిజిటల్ సాంకేతిక అంశాలపై రెండు రోజులపాటు కాన్ఫరెన్స్‌లు నిర్వహించబడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసక్తి గల రైతులు స్వచ్ఛందంగా పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్, వ్యవసాయ సహాయ సంచాలకులు వినయ్ కుమార్, రాజ్ నారాయణ పాల్గొన్నారు.

## ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం



**నవతెలంగాణ-పెద్దశంకరంపేట**

శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి జన్మదినం సందర్భంగా వసంత పంచమిని పురస్కరించుకొని పెద్ద శంకరంపేట మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు రాయలగారి మహేష్ శర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, శ్రీ సరస్వతి అష్టోత్తరం, గాయత్రి యజ్ఞం నిర్వహించారు. అనంతరం బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో అర్చన చేయించిన కుంకుమ అమ్మవారి ఫోటోతో చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బంజ వీరప్ప మాట్లాడుతూ శ్రీ సరస్వతీ శిశు మందిరంలో ప్రతి సంవత్సరం మాఘ మాసం శుక్లపక్షం ఐదో రోజు వసంత పంచమి పండుగను నిర్వహించి చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహిస్తామని అమ్మవారి కృపతో చిన్నారులకు మంచి జ్ఞానం లభించాలన్నారు. వసంత పంచమి సందర్భంగా ఒకటవ తరగతి విద్యార్థిని చందన బృందం సరస్వతి అమ్మవారు వేషధారణలో చేసిన నృత్యంతోపాటు విద్యార్థులు పాడిన భక్తి గీతాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు కోణం విట్టల్, ఎంపీటీసీ వీణ సుభాష్ గౌడ్, పాఠశాల అధ్యక్షులు దాదిగారి గంగాధర్, జంగం రాఘవులు, పల్లెబోయిన పున్నయ్య, కిష్టారెడ్డి, బుడాల సాయిలు, బోండ్ల ప్రకాశం, బండల శ్రావణ్, గంగారెడ్డి, గాండ్ల సంగమేశ్వర్, సీతారామరావు దేశ్పాండే, సతీష్ గౌడ్, ఎర్ర శ్రీహరి, సతీష్ , జైహింద్ రెడ్డి, శ్రీనివాస్, విద్యార్థిని తల్లిదండ్రులు చిన్నారులు పాల్గొన్నారు.



**నవతెలంగాణ-రామాయంపేట**

మండల కేంద్రంలోని అశోక్ సింగల్ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. బుధవారం వసంత పంచమి సందర్భంగా గాయత్రీ సరస్వతి యజ్ఞం నిర్వహించిన అనంతరం అక్షరాభ్యాస కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో రెడ్డిగారి హరిస్మరన్ రెడ్డి, ఏలూరి పండరినాథ్, రఘుపతి గౌడ్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

## 18 వరకు కొనసాగనున్న శ్రీ తిరుమల శ్రీవారి బ్రమ్మోత్సవాలు

**అధిక సంఖ్యలో రానున్న భక్తులు**
**భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన దేవాదాయ శాఖ అధికారులు**
**నవ తెలంగాణ-నిజాంపేట**



మండల పరిధిలోని చల్మేడ గ్రామంలో ఏకశిలా బండపై ఏకశిలా రూపుడై కొలువైన శ్రీ తిరుమల స్వామి బ్రమ్మోత్సవాలు ఈ నెల 15 నుంచి 18 వరకు కొనసాగనున్నాయి. ఈ ఆలయాన్ని 13వ శతాబ్దంలో కాకతీయులు కట్టించారని స్థానికులు చెబుతారు. ఉత్తర ద్వార దర్శనమే ఈ ఆలయం ప్రత్యేకత. చల్మేడ శివారులో గల శ్రీ తిరుమల స్వామి ఆలయంలో బ్రమ్మోత్సవాలు గురువారం నుంచి త్రయోగ్నిక దీక్షతో పాంచరాత్ర ఆగమ శాస్త్ర ప్రకారం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అర్చకులు, ఎండోమెంట్ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం సాయంత్రం శాంతి పాఠం, పుణ్య వహచనం, అంకురార్పణ, అరగింపు, శుక్రవారం రథసప్తమి పురస్కరించుకుని ధ్వజారోహణం, మూల మూర్తుల అభిషేకం, అలంకారం, నైవేద్యం, స్వామి వారి కల్యాణం,హెూమం, బండ్లు తిరుగుట, శనివారం బాలబోగం, అభిషేకం, గరుడోత్సవం, రథోత్సవం, ఆదివారం నిత్య హెూమం, పూర్ణాహుతి, చక్రతీర్థం, పండిత సన్మానంతో బ్రమ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ అర్చకులు తెలిపారు.

## శ్రీ భ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం

**కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి**
**నవతెలంగాణ-వెల్దుర్తి**



మండలంలోని బస్వాపూర్ పరిసరాల్లో స్వయంగా వెలిసిన శ్రీ భ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామి దేవాలయం 46వ వార్షిక బ్రహ్మోత్సవాలు రెండో రోజు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బుధవారం శ్రీ భ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం వేద పండితుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవానికి కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. పల్లకి సేవ బోనాలు సాంస్కృతిక కార్యక్రమం భగవాన్ నామ స్మరణ అఖండ భజన వంటి కార్యక్రమాలను ఆలయ కమిటీ నిర్వాహకులు చేపట్టారు. పౌరోహిత్య నిర్వాహకులు శంభుని లక్ష్మీకాంత శర్మ శంభుని రాజు శర్మ యామవరం రఘువీరశర్మలు ఆలయ కమిటీ భక్త బృందం గ్రామ ప్రజలు భక్తులు పాల్గొన్నారు.

## కేసీఆర్ కాలనీ రిక్వెస్ట్ బస్టాప్ ఏర్పాటు

**నవతెలంగాణ-రామాయంపేట** : నూతనంగా నిర్మించిన కేసీఆర్ కాలనీ వద్ద కాలనీ వాసులు తమ స్వంత నిధులతో రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేసుకున్నారు. కాలనీ వాసులు అందరూ కలిసి రిక్వెస్ట్ బస్ స్టాప్‌ను నిర్మించుకున్నారు. ప్రతినెల కాలనీ అభివృద్ధి కోసం నెలవారి చందా వేసుకుని, కాలనీలో చిన్నచిన్న మౌలిక వసతులు ఏర్పాటు చేసుకుంటున్నట్లు కాలనీ అధ్యక్షుడు కట్ట ప్రభాకర్ తెలిపారు. కాలనీవాసులు ప్రతి ఒక్కరు నెలవారి చందా ఇవ్వాలని కోరారు.

## మార్చి9న లోక్ అదాలత్

**జిల్లా జడ్జి కె. ప్రభాకర్ రావు**

**నవతెలంగాణ-సంగారెడ్డి** : మార్చి 9న నిర్వహించబోయే లోక్ అదాలత్ ఉపయోగించుకోవాలని సంగారెడ్డి జిల్లా న్యాయ సేవ అధికారి సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె ప్రభాకర్ రావు తెలిపారు. బుధవారం కోర్టు ఆవరణలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు మార్చి 9న లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్, జోగిపేట్ న్యాయస్థానంలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని అన్నారు. లోక్ అదాలతో ప్రజలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందన్నారు. ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందన్నారు. చిన్నచిన్న నేరాలు, రాజీపడే కేసులు ఉంటాయన్నారు. గత డిసెంబర్లో నిర్వహించిన లోక్ అదాలత్ లో14 వేల కేసులు పరిష్కారం అయ్యాయని తెలియజేశారు. రాష్ట్రంలో సంగారెడ్డి జిల్లా 15వ స్థానంలో లోక్ అదాలత్ పరిష్కారంలో నిలిచిందన్నారు. విలేకరుల సమావేశంలో, జడ్జిలు సుదర్శన్, సునీత రవీంద్రారెడ్డి, కృష్ణ అర్జున, లావణ్య, లక్ష్మణ చారి, అనిత దామోదర్ రాపోల్, పట్లోళ్ల తేజశ్రీ, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ జె. హనుమంతరావు పాల్గొన్నారు.

## ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్

**నవ తెలంగాణ-టేక్మాల్**



మండలంలో ప్రసిద్ధి గాంచిన షహదల దర్గా 196వ ఉర్సు ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తెలంగాణ ప్రభుత్వంలో దర్గా అభివృద్ధి కోసం నిధులు కేటాయించామన్నారు సిసి రోడ్లు ఐమాక్స్ లైట్లు కోసం ప్రత్యేక నిధులు ఇచ్చి దర్గా అభివృద్ధికి పాటుపడ్డామన్నారు. ఈ దర్గా తనకు సెంటిమెంటు అని అన్నారు. మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు భక్తుల వీరప్ప, మాజీ ఎంపీటీసీ సిద్దన్న, బీఆర్ఎస్ జిల్లా నాయకులు భాస్కర్, జిల్లా మైనార్టీ నాయకులు ఎంఎస్ సలీం, చింత రవి, మహేందర్, ఉన్నారు

## రాష్ట్రస్థాయి అవార్డులకు మహిళల నుండి దరఖాస్తులు ఆహ్వానం

**నవతెలంగాణ-సంగారెడ్డి** : అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చి 8వ తేదీని పురస్కరించుకొని మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి అవార్డులకు నామినేషన్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సంవత్సరం జరుపుకునే అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా ఈ ఏడాది కూడా రాష్ట్రస్థాయి అవార్డులు ఎంపికకు నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన ఔత్సాహికులైన మహిళలు దరఖాస్తులను ఈనెల 20వ తేదీ సాయంత్రము 5 గంటల లోగా జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం నందు సమర్పించాలని తెలియజేశారు.

## కేతకీ ఆలయాన్ని దర్శించిన డీఆర్‌డీఓ

**నవతెలంగాణ - ఝరాసంగం** : దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయాన్ని బుధవారం సంగారెడ్డి జిల్లా డీఆర్‌డీఓ ఎం.జ్యోతి దంపతులు దర్శించుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ సీఈఓగా విధులు నిర్వహిస్తున్న ఆమె బదిలీలో భాగంగా సంగారెడ్డి జిల్లా డీఆర్‌డీఓగా బాధ్యతలు స్వీకరించారు. బుధవారం నాడే వసంత పంచమి కావడంతో ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయం తరపున ఆలయ అర్చకులు వేద మంత్రాలు పఠిస్తూ శాలువా పూలమాలలతో సన్మానించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి జాతీయ ఉపాధిహామి పథకం సిబ్బందితో పాటు పేదరిక నిర్మూలనా సంస్థ సిబ్బందితో పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధిహామి పథకం నిర్వాహణలో ఫీల్డ్ అసిస్టెంట్‌లదే కీలక పాత్ర అని జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉండాలంటే బాధ్యతలను శ్రద్ధతో నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ మారుతీవిఠోబా, డీపీఎంలు మల్లేశం, రవీందర్, కొమురయ్య, ఎపీఎంలు వెంకట్, బాలక్రిష్ణ, ఏపీఓ రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే తరపున పుస్తె మట్టెల పంపిణీ

**నవ తెలంగాణ- రామాయంపేట**

నిరుపేద వధువు వివాహానికి మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ తరపున పుస్తె మట్టెలు అందించారు. మండల పరిధిలోని ప్రగతి ధర్మారం గ్రామానికి చెందిన కట్ట స్వరూప-కీ.శే. మల్లేశం దంపతుల కూతురు లత వివాహానికి బుధవారం గ్రామ కాంగ్రెస్ నాయకులు బండారి శ్రీనివాస్ గౌడ్, షాదుల్, మల్లేశం, నాగరాజు, మహేందర్ గౌడ్‌లతోపాటు పలువురు పుస్తె మట్టెలను అందించారు. ఎమ్మెల్యే మైనపల్లి రోహిత్‌కు లత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## పటాన్ చెరు డిఎస్పీగా రవీందర్ రెడ్డి

**నవతెలంగాణ - పటాన్ చెరు**



రాష్ట్ర వ్యాప్త బదిలీలలో భాగంగా పటాన్ చెరు డిఎస్పీగా పి రవీందర్ రెడ్డి బుధవారం పదవి బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న డిఎస్పి పురుషోత్తం రెడ్డి హైదరాబాదులోని మల్కాజ్ గిరి డిఎస్పీగా బదిలీపై వెళ్లారు. డిటిసి డిఎస్పి గా విధులు నిర్వర్తిస్తున్న రవీందర్ రెడ్డి పటాన్ చెరు డిఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా డిఎస్పి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ కోసం కృషి చేస్తానని ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉన్నా నేరుగా కలిసి సమస్యలను పరిష్కరించుకోగలరని అన్నారు.

## ఇంటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్న విద్యుత్ సిబ్బంది

**నవ తెలంగాణ- రామాయంపేట**

గృహజ్యోతి పథకంలో భాగంగా విద్యుత్ సిబ్బంది ఇంటింటికి వెళ్లి లబ్ధిదారుల వివరాలు సేకరిస్తున్నారు. గత నాలుగు రోజుల నుండి విద్యుత్ సబ్స్టేషన్ ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసిన విద్యుత్ అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. ఇప్పటికీ దరఖాస్తు చేసుకొని లబ్ధిదారుల కోసం విద్యుత్ సిబ్బంది బుధవారం ఇంటింటికి వెళ్లి దరఖాస్తులు తీసుకుంటున్నారు. దరఖాస్తుల సేకరణ కోసం విద్యుత్ సబ్ స్టేషన్ లో ప్రత్యేక కౌంటర్ కొనసాగుతుందని, అలాగే ఇంటింటికి వచ్చి దరఖాస్తులు తీసుకుంటామని రామాయంపేట విద్యుత్ ఏఈ పెంట్యా నాయక్ తెలిపారు. లబ్ధిదారులు ప్రజా పాలన రసీదు. ఆధార్ కార్డు, ఆహార భద్రత కార్డు దరఖాస్తు తో పాటు అందించాలని తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సిద్దిపేట
4
గురువారం | 15 ఫిబ్రవరి 2024 | www.navatelangana.com

## గృహజ్యోతి పథకం అన్‌లైన్‌లో ఎంట్రీ



**నవతెలంగాణ-మర్కుక్**

మండల పరిధిలోని చేబర్తి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద విద్యుత్ శాఖ అధికారులు గృహజ్యోతి పథకం కోసం వివరాలను అన్‌లైన్‌లో ఎంట్రీ చేస్తున్నారని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మర్కుక్ మండల ఉపాధ్యాక్షులు ర్యాకం యాదగిరి సూచించారు. చేబర్తి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద విద్యుత్ శాఖ ఆధికారులు గృహజ్యోతి పథకం కోసం వివరాలను అన్‌లైన్‌లో ఎంట్రీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో చేబర్తి ప్రత్యేక అధికారి, తహశీల్దారు చంద్రశేఖర్ రెడ్డి, విద్యుత్ ఏఈ సుధీర్, సిబ్బంది గోవర్ధన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సిద్దేశ్వర్, గ్రామస్థులు, తదితరులున్నారు.

## పుల్వామాలో దాడి అమరులకు నివాళులు



**నవతెలంగాణ-మర్కుక్**

జమ్ముకాశ్మీర్‌లోని పుల్వామాలో దాడిలో అమరులైన సైనికుల చిత్రటాలకు మండల కేంద్రమైన మర్కుక్‌లో బుధవారం నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అఖిల పక్ష నాయకులు మాట్లాడుతూ ఈ రోజు చీకటి రోజని , దాడిలో వీర మరణం పొందిన 40 మంది అమర సైనికుల అశాయాల కోసం యువత ముందుకు సాగలన్నారు. పాకిస్తానీ ఉగ్రమూకల దాడిలో వీరమరణం పొందిన అమరజవానుల సేవలను దేశ ప్రజలు ఎన్నటికీ మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల పక్షం నాయకులు కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యాక్షులు బబ్బూరు మల్లే గౌడ్, బిజెపి మర్కుక్ మండలాధ్యక్షులు టి.రమేష్ గుప్తా, బీఆర్ఎస్ నాయకులు సతీష్ గౌడ్, సాయిని మహేష్, నాయకులు అంజిరెడ్డి, లింగ సత్యనారాయణ, బాలరాజు, యాదగిరి, కానమైన ఎంగొండ, కృష్ణ, పేర్ల చంద్రం, అంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువకులు తదితరులున్నారు.

# హల్ది వాగులోకి నీళ్లను విడుదల చేయకపోతే రాజీవ్ రహదారిని దిగ్బంధం చేస్తాం

- అటవీ అభివృద్ధి సంస్థ మాజీచైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి

**నవతెలంగాణ-గజ్వేల్**

కొండపోచమ్మ సాగర్ సంగారెడ్డి కెనాల్ వద్ద హల్దీ వాగులోకి రైతులకు సాగునీటిని వెంటనే విడుదల చేయాలని అటవీ అభివృద్ధి సంస్థ మాజీచైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి డిమాండ్ చేశారు. సాగునీటిని విడుదనల చేయాలని అటవీ అభివృద్ధి సంస్థ మాజీచైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, రైతులు బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ కొండపోచమ్మ సాగర్ సంగారెడ్డి కెనాల్ నుంచి హల్ది వాగులోకి రైతుల పంటలకు సాగునీరుని విడుదల చేయకపోతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున రాజీవ్ రహదారిని దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వంపై విమర్శలు చేయడం మానుకొని రైతుల పంటలకు వెంటనే నీళ్ల విడుదల చేయాలని డిమాండ్ చేశారు. హల్దివాగులో నీళ్లను వదలడం ద్వారా వర్గల్ మండలంలోని పెద్ద చెరువు సాకారం అంబర్పేట కాల్ చెరువుల నుంచి నాచారం నింపుకొని తూప్రాన్ మాసాయిపేట వెల్దుర్తి చిన్న శంకరంపేట్ కొల్చారం మీదుగా నీళ్ల మంజీరాలోకి వెళ్తాయన్నారు లక్షలాది ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు సరైన సమయంలో నీళ్లను వదలక పోతే పంటలు ఎండిపోయి రైతులు ఆత్మహత్య చేసుకునే స్థాయికి వస్తారన్నారు. దాదాపు హల్ది వాగులో నీళ్లను వదలడం ద్వారా గజ్వేల్ మెదక్ జుక్కల్ బాన్సువాడ నర్సాపూర్ నియోజకవర్గాల రైతులకు సాగునీరు అందుతుందన్నారు. 72 కిలోమీటర్లు ప్రయాణించే హల్దివాగుకు రెండు వైపులా లక్ష ఎకరాల పంట సాగు జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంకు కాళేశ్వరం పై పెట్టే వంకలు తప్ప రైతుల శ్రేయస్సుపై ఏ మాత్రం ప్రేమ శ్రద్ధ లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ మంత్రులు కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధపు అసత్యపు మాటలతో కాలయాపన చేస్తూ రాజకీయ పబ్బం గడుపుతున్నారని తెలిపారు. గత కేసిఆర్ ప్రభుత్వం రైతును రాజును చేస్తే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం



రైతును బిచ్చగాళ్లను చేసే మాదిరిగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రం కెసిఆర్ సాధించకపోతే తెలంగాణ రాష్ట్రంలో ప్రాజెక్టులు ఉండేవా అని ప్రశ్నించారు.

## సీపీని కలిసిన మర్కుక్ ఎస్ఐ మధుకర్ రెడ్డి



**నవతెలంగాణ-మర్కుక్**

మర్కుక్ పోలీస్ నూతన ఎస్ఐ సిహెచ్. మధుకర్ రెడ్డి ఇటీవల బాధ్యతలు చేపట్టారు. బుధవారం పోలీస్ కమిషనర్ డా.బి. అనురాధను మర్యాదపూర్వకంగా కలసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ శాంతి భద్రతలకు పెద్దపీట వేయాలని, సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలకు ఎల్లవేళలా అందు బాటులో ఉండి విధులు నిర్వహించాలన్నారు. గంజాయి డ్రగ్స్ ఇతర మతు పదార్థాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. మత్తు పదార్థాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని తెలిపారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల సందర్భంగా ముందస్తు ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు.

## నూతన ఎంపీడీఓగా బండి లక్ష్మప్ప



**నవతెలంగాణ-బెజ్జంకి**

మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బండి లక్ష్మప్ప బుధవారం బాధ్యతలు చేపట్టారు. వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండల ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వర్తించిన బండి లక్ష్మప్ప మండలానికి ఎంపీడీఓగా ఇటీవల బదిలీ అయ్యారు. నూతన ఎంపీడీఓకు సూపరిండెంట్ అంజయ్య, ఎంపీఓ విష్ణు వర్ధన్, మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ సిబ్బంది ఘన స్వాగత పలికారు.

### ప్రత్యేకాధికారిగా బాధ్యతలు

మండల కేంద్రంతో పాటు తోటపల్లి, కల్లెపల్లి గ్రామాలకు మండల ఎంపీడీఓ ప్రత్యేకాధికారిగా నియమాకమైన విషయం తెలిసిందే. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఎంపీడీఓ బండి లక్ష్మప్ప సూపరిండెంట్ అంజయ్య, ఎంపీఓ విష్ణు వర్ధన్‌తో కలిసి సందర్శించి ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. పంచాయతీ కార్యదర్శి ప్రనీత్ రెడ్డి, పంచాయతీ సిబ్బంది ఎంపీడీఓకు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం శాలువా కప్పి సన్మానించారు.

## 19న చత్రపతి శివాజీ విగ్రహ పునః ప్రతిష్ట



**నవతెలంగాణ-సిద్దిపేట**

పట్టణంలోని వెంకటేశ్వర దేవాలయం వద్ద ఈ నెల 19న చత్రపతి శివాజీ విగ్రహ పునః ప్రతిష్ట నిర్వహించడం జరుగుతుందని ధర్మ కార్య ఉత్సవ సమితి సభ్యులు కొత్తకొండ రాజు తెలిపారు. బుధవారం విగ్రహ ప్రతిష్ట కరపత్రం, పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ సామ్రాజ్య స్థాపనకు నిర్విరామ కృషి చేసిన వీర శివాజీ విగ్రహ పునః ప్రతిష్ట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు శ్రీనివాస్ రెడ్డి , డాక్టర్ గుండ్ల కాశీనాథ్, డాక్టర్ విశ్వనాథం, మొబైల్ రమేష్, టైలర్ శ్రీనివాస్, కోటి, పొదిల శ్రీనివాస్, హిందూ వాహిని జిల్లా సంయోజక్ సత్యం, జిల్లా సహ సంయోజక్ బండి కిరణ్ కుమార్, రాజు, కొమ్మ ధనంజయ్, తాటిపల్లి రాజు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులు పీఎం కిసాన్‌కు ఈకేవైసి చేసుకోవాలి

- వ్యవసాయాధికారి డా.టి.నాగేందర్ రెడ్డి



**నవతెలంగాణ-మర్కుక్**

పట్టాదారు పాస్ పుస్తకం వచ్చి వుండి పీఎం కిసాన్ డబ్బులు పడుతున్న రైతులు, ఈ మధ్య కాలంలో కొత్తగా దరఖాస్తు చేసుకున్న రైతులు తప్పనిసరిగా ఈకెవైసి చేయించు కోవాలని మండల వ్యవసాయాదికారి డా.టి.నాగేందర్ రెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రమైన మర్కుక్‌లో ఆయన మాట్లాడుతూ రైతులు ఈకెవైసి చేసుకొని యెడల వచ్చే 16 దఫా రూ. 2వేలు ఖాతాలో పడవని తెలియజేశారు. ఇందులో భాగంగా శివార్ వెంకటపూర్, వర్ధరాజపూర్, మర్కుక్, ఎర్రవల్లి గ్రామాలలో ఈ కార్యక్రమం చేపట్టారు. అంతేకాకుండా ఆధార్ అనుసంధానం లేని బ్యాంకు ఖాతాలకు అనుసంధానం చేసుకోవాలని, కొత్తగా పోస్ట్ ఆఫీస్ అకౌంటు తీసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు అశ్విని, విష్ణువర్ధన్, రైతులు పాల్గొన్నారు.

## హనుమాన్ దేవాలయాన్ని సందర్శించిన అధికారులు



**నవతెలంగాణ-మద్దూరు**

మండలంలోని వల్లంపట్ల హనుమాన్ దేవాలయాన్ని దేవాదాయ శాఖ ఏఈ రమేష్ దేవాలయాన్ని సందర్శించి దేవాలయం కొలతలను, చుట్టు ప్రహరీ గోడ కొలతలు, వినాయకుని విగ్రహానికి నూతన గుడి, మండపం కోసం కొలతలు తీసుకోవడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ గత సంవత్సరంలో గ్రామ తాజా మాజీ సర్పంచ్ ఆలేటి రజిత యాదగిరి గ్రామపంచాయతీ నుంచి తీర్మానం చేసి దేవదాయ శాఖకు దరఖాస్తు పెట్టడం జరిగిందని ఆయన తెలిపారు. అధికారుల ఆదేశాల మేరకు ఈ రోజు దేవాలయాన్ని సందర్శించి కొలతలు తీసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ తాజా మాజీ సర్పంచ్ ఆలేటి రజిత యాదగిరి, దేవాదాయ శాఖ అధికారులు వెంకటేశ్వర్లు. గ్రామస్తులు బత్తిని రాజు రాజేష్.తదితరులు పాల్గొన్నారు.

## యువత గంజాయి, డ్రగ్స్ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- రోడ్డు భద్రత, సైబర్, నేరాలపై అవగాహన
- మర్కుక్ ఎస్ఐ సిహెచ్.మధుకర్ రెడ్డి



**నవతెలంగాణ-మర్కుక్**

యువత గంజాయి, డ్రగ్స్ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మర్కుక్ ఎస్ఐ సిహెచ్. మధుకర్ రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని గణేష్ పల్లి గ్రామంలో రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా రోడ్డు భద్రత, సైబర్, నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలు దాచిన వారిపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. మత్తు పదార్థాలు వాడుతున్న వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. గంజాయిరహిత మండలమే తమ లక్ష్యమన్నారు. ఎంతటి వారైన చట్టానికి లోబడి నడుచుకోవాలన్నారు. లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ బాలరాజు, గ్రామస్థులు, తదితరులున్నారు.

# రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

- రైతు సంఘం నాయకులు పచ్చిమట్ల రవీందర్ గౌడ్

**నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్**

కేంద్ర ప్రభుత్వం 2020-21 సంవత్సరంలో తీసుకువచ్చిన రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని, రైతు సంఘం నాయకులు పచ్చిమట్ల రవీందర్ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం హుస్నాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 22 పంటలకు మద్దతు ధర నిర్ణయిస్తూ చట్టం చేయాలని కోరారు. భారతరత్న డాక్టర్ స్వామి నాథన్ సూచనలను పరిగణలోకి తీసుకొని రైతుల ఆదాయం పంట ఉత్పత్తి వ్యయం మీద 50% లాభం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు వ్యవసాయ మౌలిక కల్పనల సౌకర్యం కింద బడ్జెట్లో లక్ష కోట్లు రూపాయలు కేటాయిస్తామని, గత మూడు సంవత్సరాలలో 12 వేల కోట్లు కేటాయించి చేతులు దులిపేసుకున్నారని ఆరోపించారు. దేశంలో ఇప్పటివరకు చెరుకు పంటకు తప్ప ఏ పంటలకు మద్దతు ధరలు లేవన్నారు. ఈనెల 16వ తేదీ



భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు గుర్రాల సంజీవరెడ్డి, గంగుల రాజయ్య, నమిలికొండ ఐలయ్య, పూదరి కొమురయ్య, బీఎస్పీ నాయకులు వేల్పుల రాజు పాల్గొన్నారు.

# ముంపు గ్రామ ఉపాధి హామీ కూలీలకు పని కల్పించాలి

- డిబిఎఫ్ నాయకులు

**నవతెలంగాణ-గజ్వేల్**

మల్లన్న సాగర్ ముంపు గ్రామాల ఉపాధి హామీ కూలీలకు పని కల్పించాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణులు కోరారు. ఉపాధి హామీ కూలీలతో ధర్నా నిర్వహించి ఇన్చార్జి ఎంపిడిఓ జయపాల్ రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. బుధవారం సమీకృత భవనంలో వారు మాట్లాడుతూ మల్లన్న సాగర్ పరిధిలోని ఏటిగడ్డకిష్టాపూర్‌లో 1253, లక్ష్మాపూర్‌లో 388 రాంపూర్‌లో 320, బ్రహ్మణ బంజేరు పల్లిలో 267, ఎర్రవళ్ళిలో 800, సింగారంలో 330 కుటుంబాలు ఉన్నాయన్నారు. రెక్కాడితేగాని డొక్కాడని కూలీ కుటుంబాలకు ఉపాధి హామీ పనులు వెంటనే చూపించాలన్నారు. ఒక వైపు కన్నతల్లిలాంటి ఉన్న ఊళు పోయి గూడు చెదిరిన పక్షులలాగే ఉన్న ఎర్రవళ్ళి, సింగారం, వేములఘట్



1600 బ్రహ్మణ బంజేరుపల్లిలో 453 ఏటిగడ్డ కిష్టాపూర్ 1553 లక్ష్మాపూర్ 200, పల్లె పహడ్ 1169, రాంపూర్ 236, జాబ్ కార్డు గల కుటుంబాలు ఉన్నాయన్నారు. చెద్దామంటే వ్యవసాయం లేక పనికి పోదామంటే ఉపాధి హామీ పనులు లేక అడ్డమిది కూలీలుగా మారిన నిత్యం పనిదొరికే పరిస్థితి లేదన్నారు. వెంటనే ఉపాధి హామీ అధికారులు ముంపు గ్రామ జాబ్ కార్డుదారులకు పనులు కల్పించి ఉపాధి హామీ చట్టాన్ని గౌరవించాలన్నారు.

# ప్రతి ఇల్లు, దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

- కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం భారం కాదు, బాధ్యత
- చేర్యాల సీఐ లక్కెపురం శ్రీను

**నవతెలంగాణ-చేర్యాల**

ప్రతి ఇల్లు, దుకాణాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని చేర్యాల సీఐ లక్కెపురం శ్రీను తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్ సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం భారం కాదు, ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. నేరాలను నియంత్రించడంలో సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగ పడతాయనీ, ప్రతి గ్రామంతోపాటు పట్టణాలలో స్వచ్ఛందంగా కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తాళాలు వేసిన ఇండ్లనే దొంగలు టార్గెట్ చేస్తున్నారని, ఇండ్లలో ఉన్న విలువైన వస్తువులు, బంగారు ఆభరణాలను



బ్యాంకులలో కాని ఎక్కడైనా భద్రంగా దాచుకోవాలని తెలిపారు. ఇంటికి తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు చుట్టుపక్కల వారికి, పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. ఇటీవల చేర్యాల సర్కిల్ పరిధిలోని మూడు గ్రామాలలో తాళం వేసిన ఇండ్లలో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారని వారిని త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. సమావేశంలో ఎస్ఐ ఓడాటి దామోదర్ పాల్గొన్నారు.

# తూర్పాటి మహేష్‌కు మహానంది జాతీయ పురస్కారం

**నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్**

హుస్నాబాద్ పట్టణంలోని బుడగ జంగాల కాలనీకి చెందిన తూర్పాటి మహేష్ వాస్తు, జ్యోతిష్య శాస్త్రాలలో అత్యంత ప్రతిభ కనబర్చినందుకు మహానంది జాతీయ పురస్కారంతో పాటు""వాస్తు విద్యా విభూషణ్ ""అనే బిరుదు పురస్కారం అందుకున్నారు. ఈ నెల 11న విజయవాడలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ తెలుగు సాంస్కృతిక సాహితీసేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయలు , వేమన జయంతి ఉత్సవాల సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ గౌరీ శంకర్ పలువురు ప్రజా ప్రతినిధులు, సాహితీ, ఆధ్యాత్మిక, సామాజిక సేవకుల సమక్షంలో రెండు పురస్కారాలను అందుకున్నారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ పట్టణం లోని భార్గవపురం సేవా సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో శిశు మందిర్ పాఠశాలలో తూర్పాటి మహేష్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు చిట్టి గోపాల్ రెడ్డి, ఉపాధ్యక్షులు చిట్టి దేవేందర్ రెడ్డి , కార్యదర్శి దొడ్డి శ్రీను, రమాదేవి, ఉపధ్యాయినులు దేవరాజు, జగదీశ్వర్ , చంద్రమౌళి, లక్ష్మయ్య, సుధాకర రావు,




రమేష్, మల్లేశం, దాక్షాయని తదితరులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

- హమాలీ సంఘం జిల్లా అధ్యక్షులు మామిడాల కనకయ్య

**నవతెలంగాణ-సిద్దిపేటరూరల్**

దేశవ్యాప్తంగా ఈ నెల 16న జరిగే కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని హమాలీ సంఘం జిల్లా అధ్యక్షులు మామిడాల కనకయ్య అన్నారు. బుధవారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో దేశవ్యాప్త కార్మిక, రైతుల సమ్మె వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలు పూర్తయినా కార్మికులకు రైతులకు ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. 44 కార్మిక చట్టాలను రద్దుచేసి 4 చట్టాలుగా విభజించి నిర్ణయం తీసుకున్నారు. వెంటనే వెనుకకు తీసుకోవాలని ఈనెల 16 న జరిగే సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుతార్ సంఘం జిల్లా అధ్యక్షులు



చింతల వెంకటయ్య, పరశురాములు, యాదగిరి, రవి, సత్తయ్య, యాదగిరి, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విలేఖరిపై దాడి చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలి

- సీఐటీయూ మండల కార్యదర్శి అమ్ముల బాల నర్సయ్య

**నవతెలంగాణ-కొండపాక**

విలేకరిపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ మండల కార్యదర్శి డిమాండ్ చేశారు. మట్టి మాఫియా అక్రమ మట్టి దందా ఉమ్మడి మండలంలో విచ్చలవిడిగా కొనసాగుతుందని దానిని అరికట్టాలని డిమాండ్ చేశారు. అక్రమ మట్టి దందాను వెలుగులోకి తీసుకువచ్చిన విలేకరులపై విచక్షణ రహితంగా దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. కులం పేరుతో దూషించిన మట్టి మాఫియాపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. నిజాలను నిర్భయంగా రాస్తున్న విలేకరిపై దాడి చేయడమే కాకుండా అంతు చూస్తామని మా వెనకాల అధికారులు, నాయకులు ఉన్నారని విలేకరుల అంతు చూస్తానని నోటికి చెప్పరాని విధంగా బూతు మాటలు తిట్టిన వ్యక్తులపైన కేసులు నమోదు చేసి, ఇలాంటివి పునరావృతం కాకుండా నిందితులపై కఠిన చర్య



తీసుకొని శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టవలసి వస్తుందన్నారు ఈ దాడిని అందరు ఖండించాలని కోరారు.

## నారాయణరావుపేట ఎంపీడీవోగా శ్రీరాములు



**నవతెలంగాణ- సిద్దిపేటరూరల్**

నారాయణరావుపేట మండలం నూతన ఎంపీడీవోగా శ్రీరాములు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న మురళీధర శర్మ లోకసభ సాధారణ ఎన్నికల సందర్భంగా ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ కావడంతో మెదక్ జిల్లా నుంచి బదిలీపై వచ్చిన ఎంపీడీవో శ్రీరాములు నారాయణరావుపేట ఎంపీడీవోగా బాధ్యత స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవోకు ఎంపీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.

## నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన క్రిష్ణారెడ్డి



**నవతెలంగాణ-బెజ్జంకి**

మండల నూతన ఎస్ఐగా జే.క్రిష్ణారెడ్డి బుధవారం పోలీస్‌స్టేషన్ యందు బాధ్యతలు స్వీకరించారు. కామారెడ్డి జిల్లా మద్నూర్ మండల ఎస్ఐగా బాధ్యతలు నిర్వర్తించి బదిలీపై వచ్చి మండల నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. నూతన ఎస్ఐ క్రిష్ణారెడ్డికి ఏఎస్ఐ శంకర్ రావు, పోలీస్ స్టేషన్ సిబ్బంది గౌరవంగా ఘన స్వాగత పలికారు.

## మద్దూరు ఎంపీడీవోగా రామ్ మోహన్



**నవతెలంగాణ-మద్దూరు**

మద్దూరు నూతన ఎంపీడీవోగా సోమిశెట్టి రామ్ మోహన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగర్‌కర్నూలు జిల్లా అమరాబాద్ మండలంలో ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వర్తించి బదిలీల్లో భాగంగా మద్దూరు ఎంపీడీవోగా వచ్చినట్లు ఆయన తెలిపారు. మండల ప్రజా ప్రతినిధులు. ప్రజల సహకారంతో మండలాన్ని అభివృద్ధి చేస్తానని ఆయన తెలిపారు.

## అంగన్వాడి సెంటర్‌లో వసంత పంచమి వేడుకలు



**నవతెలంగాణ-సిద్దిపేట**

మున్సిపల్ పరిధిలో ఒకటవ వార్డు లింగారెడ్డిపల్లిలో వసంత పంచమి వేడుకల సందర్భంగా అంగన్వాడి సెంటర్‌లో పిల్లలకు పలకలను మాజీ ఎస్ఎస్‌యుఐ రాష్ట్ర కోఆర్డినేటర్, వార్డు సభ్యులు మెరుగు రాజు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పిన్నింటి ప్రదీప్ రెడ్డి, ఆకారం తిరుపతి, పిన్నింటి రాజిరెడ్డి, పోతుల లక్ష్మీనారాయణ, మెరుగు హరిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వసంత పంచమి వేడుకల్లో మున్సిపల్ చైర్ పర్సన్



**నవతెలంగాణ-సిద్దిపేట**

వసంత పంచమి సందర్భంగా పట్టణంలోని సాయి బాబా దేవాలయంలో చేపట్టిన ప్రత్యేక పూజల్లో సిద్దిపేట మున్సిపల్ చైర్ పర్సన్ కడవేరుగు మంజుల రాజనర్సు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు గందె శ్రీనివాస్ వారిని సన్మానించి, ప్రసాదాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సద్ది నాగరాజు రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సుమన్ రెడ్డి, రాజయ్య , ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన



**నవతెలంగాణ-చేర్యాల**

రోడ్డు భద్రత మాసోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం చేర్యాల మండల కేంద్రంలో సీఐ లక్కెపురం శ్రీనివాస్, ఎస్ఐ ఓడాటి దామోదర్ రోడ్డు, ట్రాఫిక్ నిబంధనల గూర్చి వాహనదారులు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్, సీటు బెల్టు పెట్టుకోవాలని కోరారు. అంతకుముందు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాహనదారులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## 'విశ్వతేజ'లో వసంత పంచమి వేడుకలు



**నవతెలంగాణ-గజ్వేల్**

స్థానిక విశ్వతేజ జూనియర్ కళాశాలలో వసంత పంచమి సందర్భంగా ప్రథమ ప్రతి ష్టాపన మహోత్సవాలు ఘనంగా నిర్వహిం చారు. కళాశాల ప్రాంగణంలో గత సంవత్సరం సరస్వతీ దేవి విగ్రహ ప్రతిష్టాపన జరుగగా ఈ సంవత్సరం వార్షికోత్సవం జరిగింది. కార్యక్రమంలో మొదటగా గణపతి పూజ, అష్టోత్తర శతనామావళి, కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ జరిగింది. కళాశాల కరస్పాండెంట్ శౌరయ్య, ప్రిన్సిపాల్ రాజు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ విద్యాధర్ బదిలీ

**నవతెలంగాణ-గజ్వేల్**

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ విద్యాధర్ బుధవారం బదిలీ అయ్యారు. రెండు సంవత్సరాల పైగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన ఆయనను జిహెచ్ఎంసికి బదిలీ చేశారు. నూతనంగా జోగులాంబ జిల్లా అలంపూర్ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న జి నర్సయ్యను గజ్వేల్‌కి బదిలీ చేశారు. ఒకటి రెండు రోజుల్లో ఆయన బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది.

## మర్కుక్ ఎంపీడీవోగా అఫ్జరోద్దిన్



**నవతెలంగాణ-మర్కుక్**

మర్కుక్ నూతన ఎంపీడీవోగా అఫ్జరోద్దిన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ డిప్యూటేన్‌పై ఇంచార్జి ఎంపీడీవోగా విధులు నిర్వర్తించిన ప్రవీణ్ గజ్వేల్‌కి వెళ్ళారు. మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తి మండల ఎంపీడీవోగా విధులు నిర్వహించిన అఫ్జరోద్దిన్ బదిలీపై మర్కుక్‌కు వచ్చారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని తెలిపారు.

## 16వేల నాణేలతో 10 అడుగుల భారీ సరస్వతీ మాత




**నవతెలంగాణ-గజ్వేల్**

వసంత పంచమి సందర్భంగా సరస్వతీదేవి జన్మించిన దినాన్ని పురస్కరించుకుని 16 వేల నాణేలతో 10అడుగుల భారీ పొడవుతో అత్యద్భుతంగా సరస్వతీ మాత చిత్రాన్ని శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యక్షులు, రాష్ట్రస్థాయి కళారత్న అవార్డ్ గ్రహీత రామకోటి రామరాజు చిత్రించారు. 3 రోజులు శ్రమించి సరస్వతీ దేవి చిత్రాన్ని చిత్రించి రామకోటి కార్యాలయంలో ఆవిష్కరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ నాశనం లేనటువంటిదాన్ని అక్షరం అంటామని, అటువంటి అక్షరానికి అధిదేవతగా, పలుకుల తల్లిగా సరస్వతీ దేవతను పూజిస్తామన్నారు.

## నూతన ఎంపీడీవోను సన్మానించిన పంచాయతీ కార్యదర్శులు

నవతెలంగాణ-జోగిపేట



అందోల్ మండల నూతన ఎంపీడీవోగా పదవీ బాధ్యతలు చేపట్టిన రాజేష్ కుమార్‌ను బుధవారం పంచాయతీ కార్యదర్శులు సన్మానించారు. అందోల్ మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం ప్రధాన కార్యదర్శి వినీత్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓను శాలువా పూలమాలతో సత్కరించారు. మండల పరిధిలోని అన్ని గ్రామాలలో ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు చేయాలని ఎంపీడీవో సూచించినట్లు పంచాయతీ కార్యదర్శులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సౌజన్య ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
గురువారం | 15 ఫిబ్రవరి 2024 | www.navatelangana.com


## గ్రామీణ విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను వెలికి తీయాలి

నవతెలంగాణ-కొండపాక



గ్రామీణ విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను వెలికి తీయాలని జిల్లా సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు ఆరేపల్లి మహాదేవ్ గౌడ్ అన్నారు. కొండపాక మండలం దుద్దెడ ఉన్నత పాఠశాల ఆవరణలో పలు పాఠశాలల విద్యార్థుల మధ్య స్నేహపూర్వక క్రీడా పోటీలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో స్నేహపూర్వకమైన వాతావరణం నెలకొల్పడానికి క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. విద్యార్థులను అన్ని రంగాల్లో ఉన్నతులుగా తీర్చిదిద్దడం కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులను ప్రోత్సాహనిస్తూ పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు చంద్రబాను, రామచంద్రం, నర్సిరెడ్డిలను ఆయన అభినందించారు. వాలీబాల్ పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన బందారం విద్యార్థులకు, ద్వితీయ బహుమతి పొందిన దుద్దెడ పాఠశాల విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమాల్లో ఎస్ఎంసి చైర్మన్ జగపతి ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

## రజక సంఘం రాష్ట్ర చైర్మన్ శంకర్‌కు ఘన సన్మానం

నవతెలంగాణ-కోహెడ



మండల కేంద్రంలోని ఫంక్షన్‌హాల్‌లో ఇటీవల రాష్ట్ర రజక సంఘం చైర్మన్‌గా బస్వరాజ్ శంకర్ ఎంపిక కావడం పట్ల రజక సంఘం మండల నాయకులు పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బస్వరాజ్ శంకర్ మాట్లాడుతూ వృత్తి పరంగా, ఆర్థికంగా బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అలాగే 50 సంవత్సరాలు పైబడిన వారికి పెన్షన్ సౌకర్యం, హైద్రాబాద్‌లో రజక సంఘ భవన ఏర్పాటుకు కృషి చేస్తాన్నారు. అలాగే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రజకసంఘం మండల అధ్యక్షుడు నంగునూరి శ్రీనివాస్, జాలిగాం రాజయ్య, ఉప్పరపల్లి రాజు, గడ్డం ఎల్లయ్య, బస్వరాజ్ చంద్రయ్య, పున్నం రాజు, జాలిగాం రమేష్, సుంకరి సారయ్య, పైడిపల్లి సంపత్, జాలిగాం సింగరయ్య, గంప మహేష్, మంద రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## రెడ్డి కాలనీలో బెంచీల ఏర్పాటు

నవతెలంగాణ-నంగునూరు



నంగునూరు మండలం తిమ్మాయిపల్లి గ్రామంలో రెడ్డి కాలనీలోని సంఘం ఆవరణలో కీర్తి శేషులు సల్లారం బాలమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు చల్లారం పద్మారెడ్డి, చల్లారం సుధాకర్ రెడ్డి రెండు బెంచీలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం అధ్యక్షులు చల్లారం రాజశేఖర్ రెడ్డి, సభ్యులు దామోదర్ రెడ్డి,భీమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దౌల్తాబాద్ ఎంపీడీవోగా వెంకట్ లక్ష్మమ్మ

నవతెలంగాణ-దౌల్తాబాద్



దౌల్తాబాద్ మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో)గా ఎం . వెంకట లక్ష్మమ్మ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో మెదక్ జిల్లా నిజాంపేట ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహించిన వెంకట లక్ష్మమ్మ డిప్యూటేషన్‌పై వెల్దుర్తి ఎంపీడీవో విధులు నిర్వహించారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా బదిలీల్లో భాగంగా దౌల్తాబాద్‌కు బదిలీపై వచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కారించేందుకు కృషి చేస్తానని ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు.

## కుకునూరుపల్లి పాఠశాలలో వసంత పంచమి వేడుకలు

నవతెలంగాణ-కొండపాక

కుకునూరు పల్లి ఉన్నత పాఠశాలలో వసంత పంచమి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో గల సరస్వతి మాత విగ్రహానికి పూజలు నిర్వహించారు. విద్యార్థులకు నోట్ బుక్‌లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్తయ్య, పిఎస్ఆర్ సేవా సంస్థ చైర్మన్ పోల్కంపల్లి నరేందర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## తులిప్స్ పాఠశాలలో ఘనంగా వసంత పంచమి వేడుకలు

నవతెలంగాణ-సిద్దిపేట



వసంత పంచమి సందర్భంగా సిద్దిపేట ఎన్సన్ పల్లెలోని తులిప్స్ పాఠశాలలో వేడుకలను ఘనంగా పాఠశాల యాజమాన్యం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కోటేశ్వర్ మాట్లాడుతూ సర్వసతి దేవి పుట్టినరోజు సందర్భంగా పాఠశాలలో ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపారు. 38 మంది విద్యార్థులు అక్షరాభ్యాసం చేయించుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రిన్సిపాల్ లు శశిధర్ గౌడ్, ప్రశుస, వెంకటేశం, కనకయ్య, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

## సుస్థిర పరిపాలన కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

నవతెలంగాణ-మర్కుక్



సుస్థిర పరిపాలన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ లక్ష్యమని పాములపర్తి తాజా మాజీ సర్పంచ్ పాములపర్తి తిర్మల్ రెడ్డి అన్నారు.బుధవారం గృహజ్యోతి పథకం కోసం లబ్ధిదారుల ఆన్ లైన్ లో పొందుపరచడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేయడం జరుగుతుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు అధికారం కోల్పోయిన తర్వాత జీర్ణించుకోకపోంతో ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేయటం సిగ్గుచేటన్నారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ ఎఈ సుదీర్, నాయకులు దేగల నర్సింలు, ప్రభాకర్, తదితరులున్నారు.

## బదిలీపై వెళ్తున్న ఏసీపీకి రామకోటి పుస్తకం అందజేత

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ ఏసీపీ రమేష్ బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఆయనను రామరాజు కలిసి రామకోటి పుస్తకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రామకోటి రామరాజు మాట్లాడుతూ అందరితో ఫ్రెండ్లీ పోలీస్‌లా ఉన్నారని, రామకోటి నిర్వహించిన ఎన్నోదైవ కార్యక్రమంలో పాల్గొన్నారని గుర్తు చేశారు. మంచి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు.

## మైనంపల్లికి స్వాగతం పలికిన అత్తు ఇమామ్

నవతెలంగాణ-సిద్దిపేట



మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మైనం పల్లి హనుమంతరావు సిదిపేటకు రావడంతో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. సిద్దిపేట పట్టణంలోని పొన్నాలలో దుబ్బాక కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి శ్రీనివాస్ రెడ్డి నూతన గృహప్రవేశం ఉన్నందున మైనంపల్లి హనుమంతరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు మధు, రాషద్, అనిల్ , వంశీ, సాయి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

నవతెలంగాణ-కొండపాక



రోడ్డు భద్రతా నియమాలు ప్రతి ఒక్కరు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని తోగుట సిఐ లతీఫ్ , కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్‌లు అన్నారు. కుకునూరు పల్లి వద్ద రాజీవ్ రహదారిపై బుధవారం రోడ్డు భద్రత మాస ఉత్సవాలపై వాహనదారులకు సిఐ పలు సూచనలు చేశారు. హెల్మెట్ ధరించాలని, సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడిపి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు. మైనర్ పిల్లలు మోటార్ సైకిల్ నడపడం నేరమన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని తెలిపారు. ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని తెలిపారు. అలాగే సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసులు విటల్, భాస్కర్ వాహనదారులు పాల్గొన్నారు.

# గంట గంటకు విద్యుత్ సరఫరా కట్

- మండల సర్వసభ సమావేశంకు అధికారులు డుమ్మా

నవతెలంగాణ-గజ్వేల్



బుధవారం గజ్వేల్ మండల పరిషత్ సర్వసభ సమావేశం మండల పరిషత్ అధ్యక్షురాలు దాసరి అమరావతి అధ్యక్షతన నిర్వహించారు. స్థానిక ఐఓసీ భవనంలో ఈ సమావేశం ప్రారంభం కాగానే కరెంటు పోతూ వచ్చింది. సమావేశం నిర్వహించిన గంటలో ఏడుసార్లు విద్యుత్తు ఉత్పత్తి నిలిచిపోయిందని మండల పరిషత్ అధ్యక్షురాలు దాసరి అమరావతి శ్యామనోహర్ మండిపడ్డారు. గంటకు 7 సార్లు విద్యుత్తు నిలిచిపోతే వచ్చే వేసవికాలంలో ఇంటిలో ప్రజలు ఎలా ఉంటారని, పంటలు ఎలా పండుతాయని ఆమె ప్రశ్నించారు. అధికారులు కూడా సమావేశానికి రాకపోవడం ఏమి పద్ధతని ఆమె అన్నారు. ఎంపీడీవో మచ్చేందర్‌ను బదిలీ చేయగా, సూపరింటెండెంట్‌కు ఇంచార్జి ఇచ్చారని ఆయన కూడా సమావేశానికి రాలేదని ఆమె పేర్కొన్నారు. సమావేశానికి అధికారులు రాకపోవడంతో ప్రజా సమస్యలు ఎలా పరిష్కారమవుతాయన్నారు. స్పెషల్ అధికారుల పాలన ఎలా జరుగుతుందని ఆమె ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో మూడు నెలలకు ఒకసారి నిర్వహించిన మండల పరిషత్ సమావేశానికి అధికారులందరూ హాజరై ప్రజా సమస్యలపై చర్చించే అవకాశం ఉందని ఇప్పుడా పరిస్థితి కనిపిస్తలేదన్నారు. ఈ విషయంలో జిల్లా ఉన్నంత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు ఆంజనేయులు, జిల్లా కన్వీనర్ అశోక్, ఎంపీటీసీలు రాజిరెడ్డి, ఆనంద్, జ్యోతి స్వామి, రాజేశ్వరి, కోఆప్షన్ తదితరులు పాల్గొన్నారు.

# 35వ రోడ్డు భద్రత మాసోత్సవాల ముగింపు

- రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు.
- సెయింట్ మేరీస్ విద్యార్థులకు అవగాహన.

నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్



వాహనదారులు రోడ్ సేఫ్టీ ప్రమాదాల నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి అన్నారు. బుధవారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని సెయింట్ మేరీస్ పాఠశాల విద్యార్థులకు రోడ్ సేఫ్టీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మురళి మాట్లాడుతూ సెంట్ మేరీ స్కూల్ విద్యార్థిని, విద్యార్థులకు ట్రాఫిక్ మోటార్ వాహనాల చట్టాలు రోడ్ సేఫ్టీ రోడ్డు ప్రమాదాల నివారణ గురించి తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించామన్నారు. 35వ రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు సందర్భంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. మోటార్ సైకిల్ వాహనదారుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, కారు వాహనాలు నడిపేటప్పుడు సైటుబెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. అధిక స్పీడ్, మానవ తప్పిదం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి జిల్లా అధికారులతో కలిసి అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ట్రాఫిక్ నియమ నిబంధనలు విద్యార్థి దశ నుండే అలవర్చుకోవడం వల్ల రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చున్నారు. ట్రాఫిక్ సిబ్బందికి డిజిటల్ కెమెరాలు అందజేయడం జరుగుతుందన్నారు. ట్రాఫిక్ లో ఉన్నప్పుడు ఏ వాహన దారుడైన ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే డిజిటల్ కెమెరాలు ఫోటో తీసి ఈ చాలన్ వస్తుందన్నారు. స్పీడ్ లేజర్ గన్ డెమో నిర్వహించి అధిక వేగం వల్ల ప్రమాదాలు జరిగి ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ ఇన్నారెడ్డి, ప్రిన్సిపల్ రాయప్ప, పాఠశాల అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

# వరిలో గంధక దుష్ప్రభావ నివారణ చర్యలు చేపట్టాలి

నవతెలంగాణ-మర్కుక్



వరిపైర్లపై గంధక దుష్ప్రభావ నివారణకు రైతులు తగు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మర్కుక్ మండల వ్యవసాయ అధికారి టి. నాగేందర్ రెడ్డి తెలిపారు. బుధవారం మర్కుక్ మండలంలోని పలు గ్రామాలలో వరి పంట పోలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానాకాలం, యాసంగిలో ఒకే పొలంలో సంవత్సరాలు తరబడి వరి సాగుచేయడం వలన వరిలో "సల్ఫైడ్" దుష్ప్రభావాన్ని వస్తున్నాయన్నారు. "సల్ఫైడ్" దుష్ప్రభావం వలన 30-50 శాతం వరకు పంట దిగుబడి నష్టపోవడం జరుగుతుందన్నారు. వరిలో ఇటువంటి పరిస్థితికి కారణం స్థానికంగా అధిక నీటి ముంపు, తగిన రీతిలో పంట వేర్లకు గాలి అందకపోవటం నేలలో రసాయన చర్యల వలన మార్పు చెందడం.,ఇనుము ధాతువు లోపం ఉండే పొలాల్లో అలాగే బరువు నేలల్లో సల్ఫైడ్ కలిగిన 20-20-0-13 లాంటి కాంప్లెక్సులను అధికంగా వాడటం లేదా సింగిల్ సూపర్ ఫాస్పెట్‌ని గాని లేదా అమ్మోనియం "సల్ఫైడ్"ని గాని ఎక్కువగా వాడటం వలన ఈ "సల్ఫైడ్" దుష్ప్రభావాన్ని పొలంలో గమనించవచ్చాన్నారు. "సల్ఫైడ్" దుష్ప్రభావం వలన మొక్కలు ఎదుగుదల క్షీణించి చనిపోయే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. దుష్ప్రభావం నివారణకు పైరు వేయటానికి మడిని తయారు చేయుటకు ముందు ఇటువంటి ప్రాంతాల్లో 1-2 బండ్ల ఎర్రమట్టిని వేసి బాగా కలియబెట్టి ఆరబెట్టడం, భూమిని ఎత్తు చేయటం చేయాలన్నారు. అమ్మోనియం "సల్ఫైడ్" వంటి ఎరువులను ఇలాంటి పొలాల్లో వాడరాదని, లీటర్ నీటికి ప్రోపినెబ్ 3గ్రాములు , 2 గ్రా కార్బెండజిమ్ , మంకోజెబ్ , 10 గ్రా 19.19.19 , 3గ్రా ఫార్ములా 4 మిశ్రమాన్ని కలిపి పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి అశ్విని , రైతులు ,తదితరులున్నారు.

# బీఎంఎస్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

- బీఎంఎస్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు సల్ల శ్రీనివాస్.

నవతెలంగాణ- గజ్వేల్



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలని బిఎంఎస్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు సల్ల శ్రీనివాస్ తెలియజేశారు. బుధవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 17,18 తేదీలలో గోదావరిఖనిలో జరిగే బీఎమ్ఎస్ 4వ త్రైవార్షిక రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని రాణే బ్రేక్ లైనింగ్ లిమిటెడ్ పరిశ్రమ దగ్గర రాణే పరిశ్రమ బీఎంఎస్ నాయకులతో కలిసి మహాసభలకు సంబంధించిన గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా సల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటాలు చేస్తూ దేశంలోనే నంబర్ వన్ స్థానంలో బీఎమ్ఎస్ నిలిచిందని తెలిపారు. ఈ రెండు రోజులు గోదావరిఖనిలో జరిగే మహాసభలను జిల్లాలోని సంఘటిత, అసంఘటిత కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయగలరని ఆయన కోరారు. ఈ సమావేశంలో బీఎంఎస్ నాయకులు పులుగం శ్రీనివాస్, ఎస్.కె.నజీర్, పి.బాల్ రెడ్డి, బి.శ్రీనివాస్, యు.మల్లయ్య, కే.విజయ్ కుమార్, జి. రంగయ్య, బి. మల్లేశం, కే. వీర్రాజు, ఎస్. యాదగిరి, బి.ఘాషిరామ్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నచిన్న ఆస్తి తగాదాలకు వెళ్లి ప్రాణాలు తీసుకోవద్దు

- క్షణికావేశంలో చేసే పొరపాట్లు మనిషి జీవితాన్ని మార్చేస్తాయి

నవతెలంగాణ-చేర్యాల



చిన్నచిన్న ఆస్తి తగాదాలకు వెళ్లి ప్రాణాలు తీసుకోవద్దని, క్షణికావేశంలో చేసే పొరపాట్లు మనిషి జీవితాన్ని మార్చేస్తాయని చేర్యాల సీఐ లక్మిరపు శ్రీను అన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆకునూరు గ్రామంలో మంగళవారం రాత్రి పోలీసు కళాబృందం ప్రజలను చైతన్య పరిచే కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, హెల్మెట్ వినియోగం, మూఢనమ్మకాలు, మంత్రాలు తంత్రాలు, సామాజిక రుగ్మతల గురించి ఎల్ఈడి స్క్రీన్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం శ్రీను మాట్లాడుతూ మూఢనమ్మకాలను నమ్మవద్దని, సైబర్ నేరాలపట్ల ప్రమాదంగా ఉండాలన్నారు. మోటార్ సైకిల్ వాహనదారుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. టెక్నాలజీ ప్రపంచంలో భానుమతి వాళ్ళు చేశారు వీళ్ళు చేశారు అంటే నమ్మవద్దని ఏదైనా అనారోగ్యంగా ఉంటే ఆసుపత్రిలో చూపించుకోవాలని తెలిపారు. జిల్లాలో చిన్న పిల్లలను ఎత్తుకుపోయే బీహార్ ఇతర రాష్ట్రాలకు చెందిన గ్యాంగులు వచ్చాయని సోషల్ మీడియాలో పుకార్లు, షికార్లు చేస్తున్నాయని, అలాంటి వ్యక్తులు ఎవరు కూడా జిల్లాలో ప్రవేశించలేదని తెలిపారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు సంఘవిద్రోహశక్తులపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రామంలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు ప్రజల దృష్టికి వస్తే వెంటనే డయల్ 100, లేదా సిద్దిపేట పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8712667100 సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి పేర్లు గోప్యం ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఓడాటి దామోదర్, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పంట పొలాల సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

- గజ్వేల్ ఏడిఏ బాబు నాయక్

నవతెలంగాణ-రాయపోల్



వరి మొక్కజొన్న పంట పొలాల వ్యాధుల నుంచి రక్షించడానికి సస్యరక్షణ చర్యలు చేపట్టి జాగ్రత్తలు వహించినట్లయితే పంటలను రక్షించుకోవచ్చని గజ్వేల్ ఏడిఏ బాబు నాయక్ అన్నారు. బుధవారం రాయపోల్ మండలం తిమ్మక్ పల్లి, కొత్తపల్లి గ్రామాలలో వరి, మొక్కజొన్న పంటపొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం యాసంగి వరిపంట పిలక దశ, నాటు వేసే దశలో ఉన్నదన్నారు. ప్రస్తుతం వరిపంటకు మొగి పురుగు, సల్ఫైడ్ ధాతువు వలన వరి నష్టమైనట్టు గమనించడం జరిగినదన్నారు. మోగి పురుగుల ఉధ్రుతి ఉన్నచో 4జి కార్టాప్ హైడ్రోక్లోరైడ్ గుళికలు ఎకరాకు 6 కలోల చొప్పున చల్లుకోవాలన్నారు. లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ పోడి మందును 0.5 మీ.లీ. మందును లీటరు నీటికి కలిపి ఎకరాకు మొత్తం 200 లీటర్ల ద్రావణాని అనగా సుమారుగా 8 నండి 10 పంపులు పిచికారి చేసుకోవాలన్నారు. 15 రోజుల తర్వాత పల్చగ ఎకరాకు 20 కిలోల యూరియా వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఈఓ ప్రశాంత్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

- అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

నవతెలంగాణ-కొండపాక



పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. బుధవారం కొండపాక మండలం దుద్దెడలో గర్భిణీలు, బాలింతలు చిన్నపిల్లలకు తీసుకోవాల్సిన పోషక విలువల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పోషక విలువలు గల ఆహార పదార్థాలు ఎక్కడో లేవని నిత్యం మనం వాడుతున్న వంటింట్లోనే ఉన్నాయన్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న బాలామృతంలో అనేక పోషక విలువలు ఉన్నాయని తెలిపారు. బాలామృతాన్ని తప్పకుండా తీసుకోవాలని సూచించారు. పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకుంటే ఎలాంటి వ్యాధులు రావన్నారు. వ్యాధులు వచ్చిన తర్వాత చికిత్స చేసుకునే బదులు రాకుండానే ముందుగా పౌష్టికాహారాన్ని తీసుకొని రోగ నిరోధక శక్తిని పెంచుకోవాలన్నారు.

## శ్రీవాణి స్కూల్లో వసంత పంచమి వేడుకలు

నవతెలంగాణ-సిద్దిపేట



జ్ఞానానికి ఆదిదేవత సరస్వతి వసంత పంచమి రోజున అవతరించిన సందర్భంగా శ్రీ వాణి స్కూల్ లో సరస్వతి అమ్మవారికి ప్రత్యేక పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సి.హెచ్. సత్యం మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వసంత పంచమి రోజున పాఠశాలలో అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తే ప్రయోజకులవుతారని తల్లిదండ్రుల నమ్మకమన్నారు. అనంతరం విద్యార్థులకు పలకలు, పుస్తకాలు, పెన్నులు అమ్మవారి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కృపాకర్, ఉపాధ్యాయులు , విద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఆలేరు ఎమ్మెల్యేను కలిసిన కురుమ సంఘం ప్రతినిధులు


నవతెలంగాణ-కొండపాక



ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య యాదవ్‌ను కుకునూరు పల్లి కురుమ సంఘం ప్రతినిధులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కుకునూరుపల్లి మాజీ సర్పంచ్ బోడపట్ల శివ యాదవ్ ఆధ్వర్యంలో కురుమ సంఘం అధ్యక్షుడు మల్లయ్య, కరుణాకర్, శ్రీనివాస్ తదితరులు కలిశారు.

## మర్యాదపూర్వకంగా డిడబ్ల్యుఓను కలసిన అంగన్వాడీలు

నవతెలంగాణ-సిద్దిపేట



నూతనంగా బదిలీపై సిద్దిపేటకు వచ్చిన మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి సావిత్రినీ మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పుష్ప తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ బదిలీపై వచ్చిన ఆమెకు శుభాకాంక్షలు తెలిపి, సన్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షురాలు శైలజ, సమీనా, నాగలక్ష్మి, శబరి తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి రూ. 5 వేల అర్థిక సహాయం

నవతెలంగాణ -నంగునూరు



నంగునూరు మండలం ఖాత గ్రామంలో కలకుంట్ల కనుకవ్వ అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం ముదిరాజ్ సంఘం తరుపున ఐదు వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షులు కొలకాని సాయిలు, కుల పెద్ద మనిషి కొలకాని సంపత్, పరమేశ్వర్, భాస్కర్, శ్రీనివాస్, సంపత్, నార్లాసు ప్రసాద్, ముదిరాజ్ కుల సభ్యులు పాల్గొన్నారు.

## హుస్నాబాద్ ఎంపీడీవోగా వేణుగోపాల్ రెడ్డి

- సన్మానించిన మండల పరిషత్ సిబ్బంది

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



హుస్నాబాద్ ఎంపీడీవోగా పులుగు వేణుగోపాల్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల హుస్నాబాద్ ఎంపీడీవో కుమారస్వామి బదిలీపై వెళ్లగా, కొహెడ సూపరింటెండెంట్ రాఘవేంద్ర రెడ్డి హుస్నాబాద్ ఇన్చార్జి ఎంపీడీవోగా పని చేశారు. కొన్ని నెలలుగా హుస్నాబాద్ పర్మినెంట్ ఎంపీడీవో లేకపోవడంతో నూతన ఎంపీడీవోగా వేణుగోపాల్ రెడ్డిని నియమించారు.

### ఎంపీడీవోను సన్మానించిన సిబ్బంది

హుస్నాబాద్ ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో పలుగు వేణుగోపాల్ రెడ్డికి మండల పరిషత్ సిబ్బంది పుష్పగుచ్ఛ అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ జనగామ రవీందర్ రావు , సాదిక్ , టైపిస్ట్ రాంరెడ్డి పుదరి శ్రీన్, ఈ సి పర్శరములు, రాకేష్ ,శ్రీదర్, లాక్ పతి, టి ఏ వెంకటేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## విలేకరిపై దాడి చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలి

నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండల విలేకరి యాదగిరి పై దాడి చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని పలువురు వేర్వేరుగా డిమాండ్ చేశారు. అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని వెలుగులోకి తెస్తున్న వారిపై దాడులకు పాల్పడడం సహించ రాని విషయమని పేర్కొన్నారు. దాడికి పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలని ఎంపీటీసీల ఫోరమ్ అధ్యక్షుడు సాయిబాబా,ఎంపీటీసీ యాదగిరి వేర్వేరుగా తీవ్రంగా ఖండించారు.

## ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అక్రమ అరెస్టు సిగ్గుచేటు



నవతెలంగాణ-సిద్దిపేట

ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను అక్రమంగా అరెస్టు చేయడం సిగ్గుచేటని బి.ఎస్.పి రాష్ట్ర కార్యదర్శి లింగంపల్లి యాదగిరి, జిల్లా ఇన్చార్జి రోమాల బాబులు అన్నారు. అక్రమ అరెస్టులను నిరసిస్తూ పట్టణంలోని స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేవెళ్ల నియోజకవర్గం లోని జన్వాడ గ్రామంలో మైనారిటీ దళితులపై ఆర్ఎస్ఎస్ గుండాలు దాడి చేస్తే, బాధితులను పరామర్శించడానికి వెళ్తున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడం ఎంతవరకు న్యాయమన్నారు. మైనార్టీ దళితులపైన ఆర్ఎస్ఎస్ గుండాలు దాడి చేస్తే ఇప్పటివరకు ఒక్కరిని కూడా అరెస్టు చేయకుండా పోలీసులు చోద్యం చూస్తున్నారన్నారు. తక్షణమే దాడి చేసిన వారిని అరెస్టు చేసి జైలుకు పంపాలని కోరారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని, లేని పక్షంలో ఈ కార్యక్రమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ ఇన్చార్జి బక్రీ చెప్యాలా అశోక్, అసెంబ్లీ అధ్యక్షుడు పుల్లూరు ఉమేష్, అసెంబ్లీ కార్యదర్శి రంగదాం భాను, ముంద్రాయి లింగం, సుమన్, రాజు,నాయకులు పాల్గొన్నారు.